



పల్లెలకు పైసలొచ్చాయ్!

జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..

జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
పల్నాడు	12,31,45,384	18,47,18,101
బాపట్ల	9,34,29,265	14,01,43,899
గుంటూరు	6,55,92,007	9,83,88,023

పంచాయతీలకు ఎట్టకేలకు నిధుల మోక్షం లభించింది. ఎనిమిది నెలల అనంతరం పంచాయతీల వారీగా వాటి బ్యాంకు ఖాతాలకు 15వ ఆర్థిక సంఘం రూ. 70.04 కోట్ల నిధులు జమ చేసే ప్రక్రియను ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. రెండు మూడు రోజుల్లో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీలకు నిధులు జమ అవుతాయని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు తెలిపారు.

పంచాయతీల ఖాతాలకు రూ 70.04 కోట్లు జమ

- ఎట్టకేలకు నిధులు విడుదల చేసిన ఆర్థిక సంఘం
- నిధుల విడుదలతో పంచాయతీల పాలక వర్గాల హర్షం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలకు 2024-25 సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను జనవరిలోనే కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. అయితే ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా తన ఖాతాలోనే ఉంచుకుంది. పంచాయతీల సర్పంచ్‌లు ఉద్యమ బాట పట్టిన నేపథ్యంలో నిధులను విడుదల చేసింది. పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంటు కింద రూ 28.21 కోట్లు,



టైడ్ గ్రాంటు కింద 41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మొదటి విడతలో కొన్ని పంచాయతీలకు ఉన్న బకాయిలను కూడా ఆర్థిక సంఘం విడుదల చేసింది.

నిధులు విడుదలతో పంచాయతీలకు ఊరట

కనీసం బ్లీచింగ్ కూడా కొనలేని స్థితిలో పంచాయతీలు కొట్టిమిట్టాడుతున్న సమయంలో ఆర్థిక సంఘం నిధుల విడుదల ఊరట నిచ్చింది. మొత్తం నిధుల్లో 60 శాతం టైడ్ నిధులుగా, 40 శాతం అన్‌టైడ్ నిధులుగా విడుదలయ్యాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారుల నిర్మాణం వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు కచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలకు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరీ ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే పాఠశాల భవనాల (మిగతా 8వ పేజీలో)

బార్లు బాధలు

రావాల్సిన దరఖాస్తులు ..

బాపట్ల జిల్లాలో తొలుత 17 బార్లకు నోటిఫికేషన్ వెలువడగా రెండింటికే మాత్రం నిబంధనల ప్రకారం దరఖాస్తులు రాగా 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీటికి కనీసం 60 దరఖాస్తులు రావాలి. అదేవిధంగా గుంటూరులో 67 బార్లకు 268, పల్నాడులో 30కి 120 దరఖాస్తులు ఈ నెల 14లోగా రావాల్సి ఉంది.



దరఖాస్తులకు స్పందన అంతంతే

- ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారుల కన్నెర్ర
- అన్నింటికీ లాటరీ జరగాలని అనధికారిక ఆదేశాలు
- నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు రాకుంటే పోస్టింగులకే ముప్పు?
- గడువు పొడిగిస్తున్నా ముందుకురాని వ్యాపారులు.. తాజాగా రీనోటిఫికేషన్

● బాబ్బాబు దరఖాస్తు వేయండి

నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం మద్యం బార్లకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. రీ నోటిఫికేషన్ జారీ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా మొత్తం బార్లకు లాటరీ ప్రక్రియ జరగాల్సిందేనని ఉన్నతాధికారులు హెచ్చరించారు. దీంతో వ్యాపారులు దరఖాస్తులు వేసేలా ఎక్కడికక్కడ ఎక్సైజ్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. గతంలో బెదిరించగా వ్యాపారులు స్పందించలేదు. దీంతో ఇప్పుడు బతిమిలాడుకుంటున్నారు. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలను కలిసి దరఖాస్తుల గండం నుంచి గట్టెక్కించాలని అభ్యర్థిస్తున్నారు. ఇద్దరు ముగ్గురు కలిసి నాలుగు దరఖాస్తులు వేస్తే ఆ బార్ వారికే వచ్చేలా చూస్తామని అధికారులు హామీ ఇస్తున్నట్లు సమాచారం. నిబంధనల విషయంలో కొంత లిబరల్‌గా కూడా ఉంటాం ముందు దరఖాస్తు చేయండని కూడా కోరుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్యం బార్ల పాలసీ ఎక్సైజ్ అధికారుల పాలిట శాపంలా మారిందా అంటే చోటుచేసుకుంటున్న పరిణామాలు అలాగే ఉంటున్నాయి. గతంలో మద్యం వ్యాపారం అంటే పెద్దఎత్తున పోటీ ఉండేది. ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలోనే రూ.కోట్లతో ఖజానా నిండేది. గతంలో వైన్స్ లైసెన్సుల జారీలోనూ ఇదే పరిస్థితి. అయితే గత నెలలో బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా వ్యాపారుల నుంచి కనీస స్పందన లేకుండా పోయింది. గడువు పొడిగించినా మూడో వంతు బార్లకు కూడా లాటరీ తీయలేకపోయారు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించింది. అయితే దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో అధికారుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఒకవైపు ఉన్నతాధికారుల హెచ్చరికలు.. మరోవైపు వ్యాపారుల నుంచి స్పందన అంతంతే కావడంతో ఎటూ పాలుపోని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. రెండు సార్లు గడువు పొడిగించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో రెండు రోజుల క్రితం బాపట్ల జిల్లా ఈఎస్‌ను కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయించారు. బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు పడకపోతే వాటి పరిధిలోని ఎక్సైజ్ సీఐలపై కూడా వేటు తప్పదనే సంకేతాలను ఉన్నతాధికారులు పంపించారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లాలో 15, గుంటూరు జిల్లాలో 67, పల్నాడులో 30 బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం తాజాగా రీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు, 15న లాటరీ ప్రక్రియ ముగించి బార్లను కేటాయించాలని అందులో తెలిపింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన అధికారులు దరఖాస్తుదారుల కోసం వేట మొదలుపెట్టారు. గతంలో నోటిఫికేషన్ వచ్చిన సమయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై ఎక్సైజ్ అధికారులు (మిగతా 8వ పేజీలో)

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో

ఆరోగ్యం

కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయోత్పత్తులను వినియోగించి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రకృతి వ్యవసాయోత్పత్తులపై కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం, డీఆర్‌డీఏ, వెలుగుశాఖల సమన్వయంతో మండల, జిల్లా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వి



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

క్రయకేంద్రాలను ప్రారంభించాలన్నారు. పురుగుమందు అవశేషాలు లేని ఆకుకూరలు, కూరగాయలు, ఆహార, పప్పుధాన్యాలు, నూనెల ఉత్పత్తులను సేకరించి ఆయా కేంద్రాల్లో విక్రయించాలని తెలిపారు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందిన వారి నుంచి మాత్రమే ఉత్పత్తులను సేకరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వినియోగంతో క్యాన్సర్, మధుమేహం, రక్తహీనత, సంతానలేమి వంటి అనేక అనారోగ్యాలు నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. గతంలో 174పంచాయతీలలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అమలు చేశామని, మరో 273 గ్రామాల్లో అమలుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం రైతు సాధికారిత సంస్థ, ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంక్షిప్త మార్గదర్శిణి, ప్రకృతి వ్యవసాయ విధానాల కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి షేక్.కలీమ్, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వేణుగోపాల్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎమ్ జె.మోహన్, డీఆర్‌డీఏ పీఎమ్ సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- జాబితా ప్రకటించిన జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ పురుషోత్తం



బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం బుధవారం ప్రకటించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్ర వారం జరిగే గురుపూజోత్సవంలో అవార్డులు అందజేస్తామని తెలిపారు. ఎంపికైన వారి వివరాలు.. వివి.కృష్ణారావు (చెరువుజమ్ములపాలెం), ఎ.రమాదేవి(మరుప్రోలువారిపాలెం), ఐ.అనిత(కొండమంజులూరు), వై.సత్యవతి(బాపట్ల), పి.రంగారావు(వడ్డెసంఘం), ఎ.శోభారాణి(అమర్తలూరు), పీఎల్ ప్రసన్నకుమారి(కావూరు), ఆర్.శ్రీనివాసరావు(తిమ్మాయపాలెం), బీవీ.చంద్రారావు(చెరువుజమ్ములపాలెం), కె.సుజాత(చినగంగాజం గొల్లపాలెం), కె.ప్రతిమ(ఇంకొల్లు మండలం చందలూరు), కె.కవితదేవి(బాపట్ల డీకేపాలెం), ఎల్.కోటేశ్వరరావు(అల్లూరు), ఎం.రాహుల్‌దేవదత్తు(పెదగొల్లపాలెం), కె.శ్రీనివాసరావు(బాపట్ల) ఆర్.శివవెంకట పోతురాజు(రాజుబంగారుపాలెం), బి.లలితాంబ(కఠారివారిపాలెం), కె.రమేష్‌బాబు(ఇంకొల్లు), జె.శ్రావణి(వేటపాలెం), బి.చిన్నఅంకారావు(చక్రాయపాలెం), టి.అంకరాజు(పూనూరు), యు.చెంచయ్య(దుండుకూరు), ఎం.అక్రమఘోరి(న్యూగొడవరి), కె.విజయచంద్ర(కారంచేడు), జి.వీరాంజనేయులు(కొప్పెరపాలెం), టి.ఇందిర(నాయనపల్లి), ఓ.రోజారమణి(వెల్లటూరు), ఎం.వి.ఆర్.ఐ.పి.శారదా(సురవరపుపల్లి), వై.వి జయలక్ష్మి(పేరలి), యు.రాజశేఖర్‌రావు(మడేపల్లి మెయిన్), బి.శ్రీనివాసు(బాపట్ల హనుమాన్‌నగర్)

రాష్ట్రస్థాయిలో..

జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ముగ్గురిని ప్రకటించారు. అద్దంకి తిమ్మాయిపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు డాక్టర్ జె.ప్రతాప్, సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం హైస్కూల్ ఉపాధ్యాయురాలు కె.మోహనాంజలి, అద్దంకి ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు ఎం.ధనలక్ష్మిలను ఎంపిక చేశారు.

కుటుంబ స్థిరత్వంలో స్త్రీ కీలకం

- భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలు
- స్త్రీశక్తి విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ స్థిరత్వంలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైనదని, అందుకే వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరులో బుధవారం సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభ నిర్వహించారు. గ్రామాల నుంచి విచ్చేసిన మహిళలు వేణుకేశవస్వామి ఆలయం నుంచి ఎమ్మెల్యేతో కలిసి ఎన్టీఆర్ పురవేదిక వరకు ర్యాలీగా చేరుకున్నారు. యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఉచిత బస్సు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాలు ప్రస్తుతం అమలు అవుతుండగా త్వరలో ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. డ్వాక్రా వ్యవస్థ ఏర్పాటుకు మూలపురుషుడు చంద్రబాబని చెప్పారు. గతంలో దీపం పథకంలో ఒకేసారి 65 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారన్నారు. ఎన్టీఆర్ హయాంలో రూ.60తో ప్రారంభించిన పింఛన్ ప్రస్తుతం రూ.4 వేలకు పెంచి అందిస్తున్నామన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి నెలకు రూ. 1000 నుంచి 1500 వరకు మిగులుతుందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా ఐటీ రంగాన్ని మంత్రి లోకేశ్ బలోపేతం చేస్తున్నారన్నారు.జగన్ పాలనలో ఎన్నో అకృత్యాలు జరిగాయని, ప్రజాస్వామ్య విలువలను కాలరాసి మహిళా సంక్షేమాన్ని కూడా పక్కన పెట్టారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారన్నారు. జగన్ నిర్వీర్యం చేసిన పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలను పూర్తి చేస్తున్నామన్నారు. 2047 డాక్యుమెంటరీ ద్వారా అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలంతా చంద్రబాబును దీవించాలని కోరారు. ప్రజా సేవకుడిగా పని చేస్తానని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే సహకరిస్తానని ఆనందబాబు హామీ ఇచ్చారు. సభలో టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వంగా సాంబిరెడ్డి, నాయకులు సాయిబాబు, మైనేని మురళీకృష్ణ, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్, శివారెడ్డి, మేరీవర్ధిని, కొల్లూరు శ్రీధర్, గవిని లక్ష్మీదుర్గా, వాకా శేషు, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



సభకు హాజరైన మహిళలు

లక్షలు వ్యయం.. అసంపూర్తి పనులు

- పార్కుల ప్రారంభంపై మంత్రి అనగాని ఆగ్రహం
- బినామీ పేర్లతో మున్సిపల్ అధికారులే కాంట్రాక్టర్లు

రేపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదంగా.. పచ్చదనంతో కనువిందు చేసేలా పార్కుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్షలు కేటాయించింది. అయితే ఆ నిధులు ఏమయ్యాయో కానీ అసంపూర్తిగానే పార్కుల్లో పనులు కనిపిస్తున్నాయి. పట్టణంలోని 2వ వార్డులోని ఎస్సీ కాలనీలో పార్కు అభివృద్ధి కోసం రూ.14 లక్షలు వెచ్చించారు. అయితే కనీసం రూ.3 లక్షలైన ఖర్చు చెయ్యని పరిస్థితి నెలకొంది. చిన్నారులు ఆడుకునే 4 ఆట వస్తువులను ఏర్పాటు చేశారే తప్ప పార్కులో కనీసం సేదతీరేందుకు బల్లలు వేసిన దాఖలాలు లేవు. కనీసం మొక్కలు కూడా కనిపించవు. లోపలకు, బయటకు వెళ్ళే సీసీరోడ్డు నిర్మాణం కీవాల్‌కే పరిమితమైంది. తాగునీటి పైప్‌లైన్లు వేసిన పరిస్థితి లేదు. నామమాత్రంగా బుసక తోలి పార్కు సిద్ధమైందని మంత్రి పేరుతో బోర్డు పెట్టారు. చంద్రమౌళిపార్కుకు రూ.26 లక్షలు మంజూరు చేస్తే కనీసం మట్టి లెవలింగ్ చెయ్యలేదు. వాకింగ్‌ట్రాక్ కీవాల్స్ వేసి వదిలేశారు. మంత్రి అనగాని ప్రశ్నిస్తారనే ఉద్దేశంతో దానిపై మ్యాట్‌ను వేసి కప్పివేశారు. పిల్లలు ఆడుకునే కొన్ని పరికరాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఆయా పార్కుల్లో అమర్చిన వస్తువులు కూడా నాణ్యంగా లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలా అరకొర పనులతో అధికారులు హడావుడిగా పార్కుల ప్రారంభోత్సవంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులే బినామీ పేర్లతో కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పార్కుల్లో పనులు చేశారని.. అందువల్లే హడావుడిగా ప్రారంభించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసంపూర్తి.. నాణ్యతా ప్రమాణాలు లేకుండా నిర్మించిన పార్కులకు మంత్రి అనగాని సత్యప్రసాద్ పేరు పెట్టారు. రూ.14 లక్షలు వెచ్చిస్తే ఇదేమి పార్కు అని మంత్రి అనగాని ఆగ్రహం వ్యక్తం చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పనుల విషయంలో అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. పైగా తన పేరు పెట్టి ఇలా అసంపూర్తిగా చేసిన పార్కును తనతోనే ప్రారంభిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



2వ వార్డులో అసంపూర్తిగా పార్కు

చంద్రమౌళిపార్కులో శిథిలావస్థకు చేరిన వాటర్‌పాంట్



యూరియా కొరతలేదు

- అక్రమ నిల్వలపై పీడీ యాక్ట్
- ప్రకటించిన కలెక్టర్ వెంకటమురళి

ఎరువుల సమస్యలపై కాల్‌సెంటర్ 8247040131

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరతలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బుధవారం ఆయన యూరియా సరఫరా, పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తే వారిపై పీడీయాక్ట్ సహ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెప్టెంబరులో జిల్లాకు 6,759 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఆ మేర సరఫరాకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా, 30 శాతం ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ-పంట, భూ రికార్డులు, రైతుల ఆధార్‌కార్డు ఆధారంగానే యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. రైతు సేవాకేంద్రాల్లో తక్కువ నిల్వలు ఉంటే సమీపంలోని కేంద్రం నుంచి వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల సమస్యలను కలెక్టరేట్‌లోని కాల్‌సెంటర్ నెంబరు 8247040131కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మార్క్‌ఫెడ్, జిల్లా మేనేజర్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

చెరుకుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యూరియా కొరత లేదని చెప్తున్నా రైతులు ఆలకించడంలేదు. ఆలస్యం చేస్తే తమకు దొరకదేమోనని బారులు తీరుతున్నారు. యూరియా



గూడవల్లి యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

వచ్చిందని తెలిస్తే వ్యవసాయ పనులు మానుకుని మరీ వచ్చి ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. నిజంగా అవసరమైన వారికి యూరియా దొరక్క అల్లాడుతున్నారు. బుధవారం గూడవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారపరపతి సంఘానికి 440 కట్టల యూరియా వచ్చింది. ఈ సమాచారం తెలియడంతో రైతులు పెద్దసంఖ్యలో గూడవల్లి పీఏసీఎస్ వద్దకు చేరారు. దీంతో అక్కడ తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మండల వ్యవసాయ అధికారి ఫారూక్ వచ్చి రైతులకు నచ్చజెప్పారు. ఒక్కొక్క రైతుకు రెండు కట్టల చొప్పున యూరియా పంపిణీ చేయించారు. అయితే అటూ ఇటూ కాకుండా పంపిణీపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 400 మంది ఉన్న సహకార సంఘానికి 440 కట్టల యూరియా ఏవిధంగా సరిపోతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత
పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు
6
పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం
● జడ్పీ సీఈవో జ్యోతిబసు



నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

విజయపురిసౌత్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 586.10 అడుగులుగా ఉంది. ఇది 300.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5654 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు మొత్తంగా 52,661 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో గా 52,661 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పశ్చిమడెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు బుధవారం విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 60,150 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 296 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1,748 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 598 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 204 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 200 క్యూసెక్కులు, కొమ్మ మూరు కాల్వకు 3320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్‌లో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

❖ పులిచింతలకు 34,118 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టులో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.177 ఎంయూ (మిలియన్ యూనిట్)ల విద్యుత్‌ను తయారు చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను 1.5 మీటర్లు, 1 గేట్‌ను 1 మీటర్ మేర ఎత్తి 25,492 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8,626 క్యూసెక్కులు మొత్తంగా 34,118 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.02 టియంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుండి 36వేల 172 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 1700 క్యూసెక్కుల నీరు లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 2100 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 639 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9600, గరిష్ఠ ధర రూ.10,851, మోడల్‌ధర రూ.10,485 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,600, గరిష్ఠ ధర రూ.10,650, మోడల్‌ధర రూ.10250 పలికాయి.

తగ్గుముఖం పట్టిన వరద

● ఊపిరిపీల్చుకుంటున్న తీరప్రాంత ప్రజలు




వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ పెనుమూడి పుష్కరఘాట్ మెట్లు

రేపల్లె, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద ఉధృతి తగ్గటంతో తీర ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరదనీరు క్రమేపీ తగ్గటంతో మండలంలోని పెనుమూడి కృష్ణానదికి వరద ఉధృతి తగ్గి పుష్కరఘాట్ మెట్లు బయటపడ్డాయి. వరద ఉధృతి తగ్గటంతో కృష్ణాకరకట్ట పరిసరప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భట్టిప్రోలు మండలం లంకగ్రామాలైన పెసర్లంకకు వెళ్ళే చిన్నరేవుల్లో వరదనీరు ఇంకా పూర్తిగా తగ్గలేదు. రాకపోకలు నిలిచిపోయి ఉన్నాయి. వాణిజ్యపంటల్లో చేరిన వరదనీరు బయటకు వెళ్ళటంతో రైతులు కొంత ఉపశయనం పొందారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద శాంతించిన కృష్ణమ్మ

● దిగువకు 36,250 క్యూసెక్కుల నీటి విడుదల



దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణమ్మ శాంతించింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 52,591 క్యూసెక్కుల వరదనీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం నమోదవగా దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. తూర్పు డెల్టా కాలువ కు 9,236 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,105 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను నిలిపివేసినట్లు రాజేశ్ తెలిపారు.

పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం

● గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు ● నకరికల్లు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



నకరికల్లులో మాట్లాడుతున్న గుంటూరు జడ్పీ సీఈఓ జ్యోతిబసు

నకరికల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం వేయనున్నట్లు జడ్పీ సీఈవో వీ జ్యోతిబసు తెలిపారు. మూడేళ్ళ కాల పరిమితి ముగియడంతో ఈ వేలం నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. నకరికల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ జనరల్ ఫండ్, జిల్లా పరిషత్ జనరల్ ఫండ్, 15 ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వినియోగించారా లేదా అనే అంశాలను పరిశీలించారు. పంచాయతీరాజ్ రికార్డులను, రిజిస్టర్లను, బిల్లులను అన్నింటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణం కోసం జిల్లా పరిషత్తు నిధులను రూ.22 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. తాగునీటి పథకాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.31 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి ఆదర్శ యోజన పథకం కింద షెడ్యూల్ కులాల అత్యధిక జనాభా కలిగిన 9 గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచాయితీకి రూ. 20 లక్షలు చొప్పున రూ.1.80 కోట్లు కేటాయించినట్లు వివరించారు. రెండో విడతలో భాగంగా గ్రామ అభివృద్ధి పథకంలో ఎంపీడీవోల ప్రతిపాదనల ఆధారంగా కేటాయింపులు చేస్తామని తెలిపారు. ఈ నిధులను సీసీ రోడ్లు, డ్రైనేజీల, కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం వెచ్చించనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టే మెటీరియల్ బిల్లులకు మ్యాచింగ్ గ్రాంట్ సమకూరుస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల పదోన్నతుల్లో భాగంగా ఈపూరు, క్రోసూరు, పెదకూరపాడు, దాచేపల్లి, దుర్గి, కారంపూడి, రెంటచింతల, నగరం, రేపల్లె, తాడేపల్లికి ఎంపీడీవోలను నియమించనున్నట్లు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులను జారీ చేస్తామని జ్యోతిబసు స్పష్టం చేశారు. నకరికల్లుతో పాటు నరసరావుపేట, ఫిరంగిపురం మండలాల రికార్డులను పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

కార్యకర్తలు చేజారిపోతున్నారనే కాసు రెచ్చగొట్టే వ్యాఖ్యలు

● కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కక్షసాధింపులు లేవు

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ళ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గురజాల అభివృద్ధికే తాను పనిచేస్తున్నానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అనేక గ్రామాలలో కూటమి నేతలపై అక్రమ కేసులు, మహిళలపై అత్యాచారాలతో పాటు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే అనేక సభలలో కక్ష సాధింపులు ఉండవని, ఎవరికి ఇష్టమైన పార్టీలో వారు కొనసాగవచ్చని హామీ ఇచ్చిందని చెప్పారు. చేతనైతే తమతో కలిసి వచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలి కాని అనవసరమైన గొడవలకు పోయి జీవితాలు పాడు చేసుకోవద్దని పలుమార్లు బహిరంగంగా తాను చెప్పానని యరపతినేని గుర్తుచేశారు. కాసు మహేష్‌రెడ్డి కార్యకర్తలను కాపాడుకునేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వారిని కేసుల్లో ఇరికించి తనచుట్టూ తిప్పుకునే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. దానిని వైసీపీ నేతలు, కార్యకర్తలు గమనించాలని అన్నారు. వైసీపీ నేతల ప్రసంగాలను, రెచ్చగొట్టే వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వారు ఒక సీటుకే పరిమితం అవుతారేమోనని అనుమానంగా ఉందని ఎమ్మెల్యే యరపతినేని పేర్కొన్నారు.

కాసు మాటలు అహంకారానికి నిదర్శనం

● పల్నాడులోని పలు స్టేషన్లలో ఆయనపై కూటమి నేతల ఫిర్యాదు



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్లో సీఐ భాస్కరరావుకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

దాచేపల్లి/పిడుగురాళ్ల/గురజాలటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే కత్తులు, గొడ్డళ్లతో సమాధానం చెబుతామంటూ రెచ్చగొడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాటలు ఆయన అహంకారానికి నిదర్శనమని కూటమి నేతలు ఆరోపించారు. బుధవారం దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల పోలీస్ స్టేషన్‌లలో కాసు మహేష్‌రెడ్డిపై ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ కాసు మహేష్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. పిడుగురాళ్ల పట్టణంలో జరిగిన స్త్రీశక్తి విజయోత్సవ సభకు విశేషంగా మహిళలు వచ్చి విజయవంతం చేయడం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలతోపాటు అభివృద్ధి చేపడుతూ ముందుకు నడుస్తున్న కూటమి ప్రభుత్వం ఆదరణను జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వస్తున్న ప్రజాదరణ చూసి మహేష్‌రెడ్డి పిచ్చెక్కినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 11 మంది టీడీపీ కార్యకర్తలు హత్యలకు గురయ్యారని, 8 మంది చిన్నారులు అక్రమంగా మైనింగ్ చేసిన క్వారీలో పడి చనిపోయారని ఆరో పించారు. 80 మంది కాళ్లు, చేతులు విరగొట్టారని, మహిళలపై అత్యాచారాలు జరిపారని, పలువురి ఆస్తులను ఆక్రమించుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యాపారస్తులు, రైతాంగం, ఉద్యోగస్తులు, మహిళలు ప్రశాంతంగా ఉంటే మరలా ఓడిపోతామనే భయంతో కాసు గొడ్డళ్ళు, కర్రలు పేరుతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. 2029లోనూ ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, కాసు నోరు అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు.

మందుల అక్రమ వ్యాపారికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమాన

గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మందులను దొంగిలించి వాటి పేర్లు, స్టిక్కర్లు మార్చి అక్రమంగా విక్రయిస్తున్న నిందితుడికి కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. తెనాలికి చెందిన దేసు నాగేశ్వరావు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వ ఈఎస్ఐ ఆసుపత్రులకు చెందిన 53 రకాల మందులతోపాటు మొత్తం 67 రకాల మందులను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణశాఖ అధికారులు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. అందులో కొన్ని మందులకు గడువుతేదీ దాటడంతో వాటిపై స్టిక్కర్లు తొలగించి కొత్తవి అంటించినట్లు గుర్తించారు. క్యూర్‌టెక్ ఫార్ములేషన్ లిమిటెడ్ ద్వారా తయారైనట్లు చెప్పిన నకిలీ ఎఫ్ఐఎక్స్ 200 మందులను కూడా అతడు నిల్వ చేసి విక్రయించినట్లు అధికారులు కనుగొన్నారు. దేసు నాగేశ్వరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా విచారించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వీఏఎల్ సత్యవతి నాగేశ్వరరావు తప్పు రుజువు కావడంతో అతడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆంధ్రా నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా తరలింపు

● పోలీసుల అదుపులో నిందితులు

దాచేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తెలంగాణకు ఆటోలో అక్రమంగా తరలిపోతున్న యూరియాను పొందుగల చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యూరియా ఉన్న ఆటోను సీజ్ చేసి నిందితులను అరెస్టు చేశారు. దాచేపల్లి ఎస్సై సౌందర్ రాజన్ వివరాల ప్రకారం, దాచేపల్లి మండల పరిధిలోని పొందుగల గ్రామం వద్దనున్న రాష్ట్ర పోలీసు చెక్ పోస్టు వద్ద అధికారులు సాధారణ తనిఖీలు చేస్తుండగా యూరియా కట్టల లోడుతో ఉన్న ఆటో వారి కంటబడింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆటోలోని 14 యూరియా కట్టలను స్వాధీన పరుచుకొని, యూరియాను తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఎటువంటి అనుమతుల్లేకుండా యూరియా కట్టలను తరలిస్తున్న ఓ ఉద్యోగిపై కూడా అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే అధికారులు పూర్తిస్థాయిలో యూరియా కట్టల నిల్వలున్నాయని చెబుతున్నప్పటికీ తెలంగాణకు చెందిన కొంత మంది వ్యక్తులు ఆంధ్ర రైతుల ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాల జిరాక్స్‌లు చూపుతూ యూరియా కట్టలను తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి దీని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తిస్తామని అధికారులు తెలిపారు.

రౌడీషీటర్లపై పోలీసుల ఉక్కుపాదం

● డీజీపీ ఆదేశాలతో స్టేషన్‌ల వారీగా వివరాల సేకరణ

సత్తెనపల్లి సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్‌లో పోలీసుస్టేషన్‌ల వారీగా రౌడీషీటర్లు ఎంతమంది ఉన్నారు, వారు ఇంకా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారా నాయకులతో అంటకాగుతూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారా అనే దిశగా వారు వివరాలు సేకరిస్తున్నారు. పదేపదే నేరాలు చేస్తున్న రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తాజాగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలు ఇవ్వడంతో పోలీసు అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. రౌడీషీటర్లు ఎంతమంది క్రియాశీలకంగా ఉన్నారు, వారంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు, రాజకీయ నాయకుల కనుసన్నల్లో మెదులుతున్నవారెందరు అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఏడాది కాలంలో రౌడీషీటర్లు ఏమైనా గొడవలలో పాల్గొన్నారా అనే అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. పాత రికార్డులను తిరగదోడి గతంలో రౌడీషీటర్లుగా నమోదైనవారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచారు. వారిని ప్రతివారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపుతున్నారు. నేర చరిత్ర ఉన్న వారిని జైలుకు పంపుతున్నారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలో నేర చరిత్ర కలిగిన ఇద్దరు యువకులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు రాజమండ్రి జైలుకు తరలించారు.

ఆంధ్రా జాలర్లపై తెలంగాణ జాలర్ల దాడి

రెంటచింతల,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రాళ్లగుట్ట వద్ద చేపలు పట్టడానికి వచ్చిన ఆంధ్రా జాలర్లపై తెలంగాణాకు చెందిన వారు దాడి చేసి దుర్భాషలాడారు. విజయపురిసౌత్‌కు చెందిన ఆంధ్రా జాలర్లు వలలు వేసి చేపలు పడుతున్న సమయంలో ఆవలి ఒడ్డున ఉన్న తెలంగాణకు చెందిన పలువురు జాలర్లు నది దగ్గరకు చేరుకుని చేపలు పట్టే హక్కులేదని వాదనకు దిగారు. మాటా మాటా పెరగడంతో పాటు తెలంగాణాకు చెందిన 15 మంది వ్యక్తులు విచక్షణారహితంగా ఆంధ్రాజాలర్లపై దాడి చేశారు. ఇక్కడ మీరు చేపలు పట్టడానికి వీల్లేదంటూ ఘీంకరించారు. మరోసారి వస్తే వేరే విధంగా ఉంటుందంటూ చిందులు వేశారు. వలలను నదిలో వేయడానికి ప్రయత్నించగా ఆంధ్రా జాలర్లంతా అడ్డుకున్నారు. ఈ మేరకు స్థానిక స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆర్డీవో మురళీ కృష్ణ, తహసీల్దార్ మేరీ కనకంతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

గురజాల, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలి

● జడ్ఆర్‌యూసీసీ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ప్రయాణికులకు ఎంతో వీలుగా ఉన్న మాచర్ల మెమో రైలుకు బోగీలు పెంచడంతో పాటు గురజాల, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్లను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు (జడ్ఆర్‌యూసీసీ) కొంకా రాధ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణ మధ్య రైల్వే 76వ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో రాధ పాల్గొని పల్నాడు ప్రాంతం మీదుగా వెళ్లే రైళ్ల నిలుపుదల, స్టేషన్ల అభివృద్ధి గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఏఎన్‌యూలో రూసా హబ్ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఉపకులపతి ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రూసా 2.0 కింద రూసా హబ్ కేంద్రంతో పాటు రీసెర్చ్ ఇన్నోవేషన్ కేంద్రం భవన నిర్మాణానికి బుధవారం ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం భూమి పూజ చేశారు. రూసా నిధుల కింద సుమారు రూ.4 కోట్లతో ఈ నిర్మాణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రూసా సమన్వయకర్త ఆచార్య మురళీమోహన్, ఆర్ట్స్ సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, దూరవిద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్, సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, యూజీ పరీక్షల సమన్వయకర్త కృష్ణారావు, విదేశీ విద్యార్థుల కేంద్రం సమన్వయకర్త పద్మావతి పాల్గొన్నారు.

నవంబరు 4 నుంచి మారనున్న డెల్టా ఎక్స్‌ప్రెస్ వేళలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేపల్లె-వికారాబాద్ మార్గంలో నడిచే డెల్టా ఎక్స్‌ప్రెస్ (17626) నవంబరు 4నుంచి మారనున్నాయి. ప్రస్తుతం రేపల్లె నుంచి ప్రతిరోజూ రాత్రి 10.40గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు తర్వాతి రోజు ఉదయం 7.20గంటలకు చేరుకుంటోంది. నవంబరు 4నుంచి వేళల్లో మార్పు కారణంగా ఈ రైలు సికింద్రాబాద్‌కు 45 నిమిషాలు ముందే (ఉదయం 6.35గంటలకు) రానుంది. వికారాబాద్‌కు ప్రస్తుతం చేరుకునే సమయం (9.40) కన్నా 20నిమిషాల ముందుగానే (9.20గంటలకు) రానుంది.

రాష్ట్ర సచివాలయ ఉద్యోగినికి సైబర్ కేటుగాళ్ల టోకరా

● సీఐడీ నుంచి మాట్లాడుతున్నామంటూ రూ. 80 వేలు కాజేత

● తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

తుళ్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేం సీఐడీ నుంచి మాట్లాడుతున్నాం.. మీ మీద కేసులు నమోదయ్యాయి, అవి మాఫీ కావాలంటే రూ. 80వేలు చెల్లించండి లేకపోతే అరెస్టు తప్పదంటూ వెలగపూడి రాష్ట్ర సచివాలయ ఉద్యోగినికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. భయపడి వారు అడినదంతా చెల్లించిన ఉద్యోగిని ఆ తర్వాత తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. రాష్ట్ర సచివాలయంలోని ఓ సెక్షన్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినికి బుధవారం అరవింద్ అనే పేరుతో ఓ వ్యక్తి ఆన్‌లైన్ కాల్ చేశాడు. తాను సీఐడీ పోలీసులనని చెప్పిన అతడు మీ మీద కేసులున్నాయి, మాఫీ చేయాలంటే రూ. 80 వేలు తక్షణం చెల్లించాలి, లేకపోతే అరెస్టు తప్పదని ఆమెను బెదిరించాడు. దాంతో భయపడిన ఆ మహిళా ఉద్యోగి కంగారులో ఫోన్ పే ద్వారా రూ. 80 వేలు చెల్లించారు. ఆ తరువాత వాకబు చేయగా సీఐడీ పేరుతో బెదిరించి ఎవరో తన నుంచి డబ్బులు కాజేశారని తెలుసుకొని తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

నేడు స్త్రీశక్తి విజయోత్సవ సభ

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్ కూడలి నందు గురువారం మధ్యాహ్నం 2గంటలకు స్త్రీశక్తి విజయోత్సవం సభ నిర్వహించనున్నట్లు తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేటి సోపాటి బుధవారం తెలిపారు. సభకు పిట్టలవానిపాలెం మండల మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని ఆమె కోరారు.

5న 5కే రన్ పోటీలు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్, ఎమ్‌కేఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ శుక్రవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి పురుషుల 5కేరన్ పోటీల్లో ఆసక్తి కలిగిన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కళాశాల పాలకవర్గం బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదల్చిన క్రీడాకారులు శుక్రవారం మధ్యాహ్నం 2గంటలలోపు తమపేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణం నందు, ఫోన్ నెంబర్లు 08643-248745, 9440529307, 9059808491లో సంప్రదించాలని వారు తెలిపారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



ఉప్పాలపాటి విద్యామణి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేవీ ఆర్‌కేవీఆర్, ఎమ్‌కేఆర్ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగంలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్న ఉప్పాలపాటి విద్యామణి ఆచార్య నాగార్జున యూనివర్సిటి నుంచి డాక్టరేట్‌ను బుధవారం అందుకున్నారు. అధ్యాపకురాలికి కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు మంతెన నరసరాజు, కళాశాల సెక్రటరి మంతెన శ్రీనివాస్ కుమార్, కళాశాల ఉపాధ్యక్షులు మంతెన వెంకటశివరామరాజు, కళాశాల జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకలు

అమృతలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మోపర్రు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధి లో బుధవారం సామాజిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీవో లక్ష్మీదేవి హాజరయ్యారు. సామూహిక సీమంతాలు జరిపారు. గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం విలువల గురించి ఆమె వివరించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, కార్యకర్తలు లీలావతి, ఉష పాల్గొన్నారు.

అమృతలూరు గ్రామంలో పారిశుధ్యం అధ్వానం

అమృతలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్యం, పందుల విహారంపై గ్రామస్థులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, పలు చోట్ల పారిశుధ్యం అధ్వానంగా ఉందంటూ దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందించేందుకు గ్రామస్థులు కార్యాలయానికి వెళ్లారు. ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందించారు.

రజకకాలనీ మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతిలో ఉన్న అపారమైన ప్రాణశక్తిని యోగా ద్వారా పొందటంతో రుగ్మతలను నయం చేసుకోవచ్చునని ప్రాణిక్ హీలింగ్, అర్హటిక్ యోగాగ్రాండ్ బాపట్ల కేంద్రం నిర్వహకులు చంద్రపాటి రామనారాయణ పేర్కొన్నారు. యోగా గ్రాండ్ మాస్టర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రజకకాలనీలోని 40మంది మహిళలకు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, సహాయకులు జె.విశ్వనాద్, జగదీష్, కాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మందపాటి ఆంద్రేయ



మందపాటి ఆంద్రేయ

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలకు పైగా తెలుగుదేశం పార్టీకి నమ్మిన బంటుగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన మందపాటి ఆంద్రేయ సేవలను గుర్తించి నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. పట్టణ టీడీపీ కార్యదర్శిగా, ఉమ్మడిజిల్లా ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఉమ్మడి రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శిగా పనిచేసిన మందపాటి ఆంద్రేయ ప్రతి ఎన్నికలో అభ్యర్థుల విజయానికి అంకితభావంతో పనిచేస్తూ వచ్చారు.

ఆయన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు ఆంద్రేయ కృతజ్ఞతలు తెలిపారు. నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవికి వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఆంద్రేయకు అభినందనలు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో కార్పొరేషన్ తొలి డైరెక్టర్‌గా సీనియర్ నాయకుడికి కేటాయించటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

● అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబునాయుడు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, అధికారులు

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి బుధవారం ఆయన యూరియా సరఫరాపై కలెక్టర్‌లు, ఎస్పీలు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు యూరియా కొరత రాకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియా 70వేల మెట్రిక్‌టన్నుల లభ్యత ఉన్నదని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని 15వ తేదీ తర్వాత మరో 53వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని ఆయన చెప్పారు. మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలి వెళ్ళకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో యూరియా కృత్రిమకొరత సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకోసం డ్రోన్‌లతో నిఘా : ఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల్లో ప్రజల భద్రత కోసం డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ అనుమతితో 2,561 వినాయక విగ్రహాలను ప్రజలు ఏర్పాటు చేశారని తెలిపారు. వీటిలో ఎక్కువశాతం వినాయక విగ్రహాలను ఓడరేవు, రామాపురం, సూర్యలంక సముద్రతీరాలతోపాటు పెనుమూడి వారధి, ఎన్ఎస్‌పీ కాల్వల్లో నిమజ్జనం చేయనున్నారని చెప్పారు. అంతేకాకుండా పల్నాడు, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూడా వినాయక విగ్రహాలను నిమజ్జనం కోసం తీరానికి తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా నిమజ్జనాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేశారన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో గజఈతగాళ్లను నియమించారన్నారు. డ్రోన్‌ల సాయంతో ఊరేగింపు మార్గాలు, నిమజ్జన స్థలాలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. సూర్యలంక సముద్రతీరంలో ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ శ్రీనివాసరావు సిబ్బంది, గజఈతగాళ్లతో గస్తీ నిర్వహించారు. నిమజ్జన సమయంలో జనసందోహం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అనుమానస్పద పరిస్థితి కనిపిస్తే వెంటనే తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.



సూర్యలంక సముద్రతీరంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ శిక్షణ తరగతులు ప్రారంభం

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల రీజియన్ 13 ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బొమ్మన బోయిన సాంబయ్య ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. బాపట్ల పరిసర ప్రాంత విద్యార్థులు, ఉపాధ్యాయులు జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలంటే వ్యక్తిత్వ వికాసం శిక్షణ ఎంతో అవసరమని ఆయన తెలిపారు. శిక్షణా తరగతులు 28 రోజులు ఆన్‌లైన్‌లో, రెండురోజులు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇక్కుర్తి శ్రీనివారావు, కోశాధికారి రామారావు, ఆవుల వెంకటేశ్వరరావు, జయం వరబాబు, ఎస్ శ్రీను పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు బి.సాంబయ్య

మైక్రోఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులపై చర్యలు తీసుకోవాలి

● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజారావు

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ మైక్రోఫైనాన్స్, బ్యాంక్ రికవరి ఏజెంట్ల వేధింపులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజారావు డిమాండ్ చేశారు. ఈవిషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ రూల్స్ ప్రకారం ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల మధ్య మాత్రమే రికవరి ఏజెంట్లు సంప్రదించాల్సి ఉందన్నారు. ప్రజలను బెదిరించటం, దూషించటం చట్టప్రకారం నేరమన్నారు. కోర్టు ఉత్తర్వులు లేకుండా ఆస్తులు జప్తు చేయకూడదన్నారు. వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. బ్యాంకులో కూడా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. అప్పు చెల్లించకపోవటం సివిల్ వివాదం మాత్రమే అన్నారు. ఫైనాన్స్ ప్రైవేట్ బ్యాంకుల రికవరి ఏజెంట్ల ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలను మానుకోవాలని రాజారావు తెలిపారు.

హిందూ ధర్మం శ్రేష్ఠమైనది

● ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోని అన్ని ధర్మాలలో హిందూ ధర్మం శ్రేష్ఠమైనదని ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. పట్టణంలోని 5వవార్డు వెలగవారి వీధిలో బుధవారం సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నగర ధర్మప్రచారక్ మోదడుగు సూరిబాబు, మహిళా కార్యకర్తలు కత్తి లక్ష్మీ, ఎన్.పద్మకుమారి, మానం అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



వెలగవారి వీధిలో సత్సంగ కార్యక్రమం నిర్వహిస్తున్న ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు తదితరులు

టవరెక్కిన నిర్లక్ష్యం



పొన్నపల్లిలో విద్యుత్‌టవర్‌ను అల్లుకున్న పిచ్చితీగలు

చెరుకుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నపల్లిలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుంది. పొన్నపల్లిలోని కారుమూరమ్మ గుడి దగ్గర జాతీయ రహదారి ప్రక్కన ఉన్న విద్యుత్ టవర్ల చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకుని ఆ పిచ్చితీగలు టవర్లపైకి ఎక్కి విద్యుత్ తీగలను చుట్టుకున్నాయి. పొరపాటున ఎవరైనా ఆ టవర్ దగ్గరకు వెళితే ప్రాణాంతకమవుతుంది. ఈ విషయమై విద్యుత్ ఏడీఈ.సురేష్‌బాబును ప్రశ్నించగా ఈ సమస్యపై త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.



మోడల్ పాఠశాలకు బీరువా వితరణ చేసిన దాతలు

మోడల్ పాఠశాలకు బీరువా వితరణ

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మోడల్ ప్రాథమిక పాఠశాలకు దాతలు ఇనుప బీరువాను బుధవారం అందించారు. భట్టిప్రోలులోని భోగేశ్వర పేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ, సిబ్బంది సౌకర్యార్థం దస్త్రాలు నిల్వ చేసుకునేందుకు మద్దుల భాస్కరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి ఉదయశ్రీ, తనయుడు సోమశేఖర్‌లు ఈ బీరువాను వితరణ చేశారు. మండల విద్యా శాఖాధికారి నీలం దేవరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం ఎంతో మేలు చేకూరుతుందని దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హుస్సేన్, ఉపాధ్యాయులు వై.రమకుమారి, ఎ.సుబ్బారావు, వాణిశ్రీ, హోమియో వైద్యులు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమరసత సేవాసమితి ఆధ్వర్యంలో సమావేశాలు

నగరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లేపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సమరసత సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 5 వరకు మండల సమావేశాలు, 13న సత్సంగం, 3, 17వ తేదిల్లో రెండుసార్లు ఏకాదశి నగర సంకీర్తన, 13న బాలవికాస కేంద్రాలు నెలవారీ శిక్షణ సమావేశాలు జరుగుతాయన్నారు. ప్రతినెల 6వ తేది నుంచి 10వ తేదీలోపు గ్రామధార్మిక సమావేశాలు, 7వ తేదీ పౌర్ణమి సందర్భంగా సామూహిక హారతులు, 22 నుంచి శరన్నవరాత్రి ప్రారంభమవుతాయని, 30న దుర్గాష్టమి, అక్టోబరు 2న విజయదశమి కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రేపల్లె సబ్ డివిజన్ ధర్మప్రచారక్ చింతల మురళీకృష్ణ, కటిక భార్గవి, బల్లాల కోదాడ రామయ్య, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతికి నక్షత్ర పూజలు



బంగారు, వెండి ఆభరణాలు అలంకారంలో సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీగణపతి స్వామి

వేమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వేమూరులోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహిస్తున్న 77వ వార్షిక నవరాత్ర మహోత్సవాలలో భాగంగా నిత్యం సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీగణపతి స్వామి వారికి నక్షత్ర పూజలు నిర్వహిస్తున్నారు. 11 రోజుల దీక్షతో ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా బుధవారం పూర్వాషాడ నక్షత్ర పూజలు జరిపారు. ఉదయం విశేష అర్చన అనంతరం సాలగ్రామాలకు అభిషేకం జరిపి సహస్ర నామ పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బుర్రకథ నిర్వహించారు. సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీగణపతి మూలవిరాట్ స్వరూపాలను పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు గజమాలతో అలంకరించారు. భజన సంఘాల వారు లలితా సహస్రనామ, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిపారు.



నడింపల్లి శివరాంపురంలో కొలువుదీరిన వినాయకుడు

నడింపల్లిలో...

చెరుకుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నడింపల్లిలోని శివరాంపురంలో శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో గత 14 సంవత్సరాల నుంచి గణపతి నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ గణపతి నిమజ్జన కార్యక్రమం ఈనెల 5వ తేదీన జరుగుతుందని శ్రీవిఘ్నేశ్వర యూత్ సభ్యులు బుధవారం తెలిపారు.

వైభవంగా విఘ్నేశ్వరుడి నిమజ్జనం



క్రేన్‌సహాయంతో వినాయకుని నిమజ్జన కార్యక్రమం

నగరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోదండ రామసేవా సమితి ఆధ్వర్యంలో ధూళిపూడిలో విఘ్నేశ్వరుడి విగ్రహ నిమజ్జనం కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. గత 26 సంవత్సరాలుగా విఘ్నేశ్వరుడి నవరాత్రులు జరుగుతున్నట్లు రామాలయ పూజారి రత్తయ్య తెలిపారు. ఈ సంవత్సరం బుర్రకృష్ణ 14 అడుగుల విగ్రహాన్ని అందించారని చెప్పారు. విఘ్నేశ్వరుని నిమజ్జనం సందర్భంగా ధూళిపూడిలో అన్నదానం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి గోపి, గుర్రం కమల్నాదు, ఉయ్యూరు భూనీషు మునిశంకర్, చిలకాల ఆదినారాయణ, తుళ్ళూరు నారాయణ, చిలకల విష్ణు, మేకా నాగేంద్రబాబు పాల్గొన్నారు.

గౌడపాలెంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు



గౌడపాలెంలో భక్తులతో పూజలు అందుకుంటున్న గణనాథుడు

కర్లపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ గౌడపాలెంలో వినాయక చవితి సందర్భంగా పూజారి శిమన్నారాయణ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 1000 మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామయువత పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

సమన్వయంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి : ఎంపీపీ

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చేసుకోవచ్చని ఎంపీపీ లలితకుమారి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాలలో అధికారులు అందుబాటులో ఉన్నారని, ఆయా శాఖలకు సంబంధించిన సరైన సమాచారాన్ని వెబ్‌సైట్‌లలో పొందుపరిచి పంచాయతీ పురోగతికి దోహదపడాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయబాబు మాట్లాడుతూ, అన్ని శాఖలకు పంచాయతీ సూచికలో భాగస్వామ్యం ఉందని, సంబంధిత వెబ్‌సైట్‌లో అడిగే ఆయా ప్రశ్నలు అన్ని శాఖలకు చెందినవని, సరైన సమాధానాలు ఇస్తేనే మండల, జిల్లా స్థాయిలో ఆమోదం లభిస్తుందన్నారు. వక్కలగడ్డ సురేష్, దోమ ఉదయభాస్కర్‌లు పంచాయతీ ప్రగతి సూచికలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, మండల గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికను తల్లి వద్దకు చేర్చిన పోలీసులు

రేపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలిక అదృశ్యమైన కేసు సాంకేతిక పరిజ్ఞానంతో చేదించటం జరిగిందని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని 24వ వార్డుకు చెందిన బాలికను 10 రోజుల కిందట కృష్ణా జిల్లా అవనిగడ్డలోని పాఠశాల్లో తల్లిదండ్రులు చేర్పించారని అక్కడ చదవనని చెప్పటంతో ఇటీవల ఇంటికి తీసుకువచ్చారు. ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. మంగళవారం పాఠశాల నుంచి బయటకు వెళ్ళిన విద్యార్థిని తిరిగి రాకపోవటంతో ఉపాధ్యాయులు బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థిని నేతాజీనగర్ సచివాలయం వద్ద ఉన్నట్లు బాలికను గుర్తించి బుధవారం తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. దీనిపై బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ పోలీస్ సిబ్బందిని అభినందించారు. పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు, కానిస్టేబుల్ రాంబాబు, వీరాంజనేయులు, పూర్ణచంద్రరావు, బుజ్జిబాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

ప్రశాంతంగా మండల పరిషత్ సమావేశం

చెరుకుపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ మాట్లాడుతూ మండలంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులను కోరారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మంచినీటి ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్

వాహనాన్ని దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన వాహనాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేత మురళీకృష్ణ

కొల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడి వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మండల కేంద్రం కొల్లూరులో ఎస్సీ కాలనీకి చెందిన బుర్రి జగజ్జీవనరావు వాటర్ ప్లాంట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంచినీటి క్యాన్‌లను గృహాలకు చేరవేసేందుకు బ్యాంకు రుణం పొంది టాటాఏస్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. వాటర్ ప్లాంటు వద్ద ఉన్న వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేయడంతో జీవనోపాధి కోల్పోయినట్లు బాధిత కుటుంబం పేర్కొంది. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ దగ్ధమైన వాహనాన్ని పరిశీలించారు. అనంతరం బాధితునితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వాహనం దగ్ధంపై ఫిర్యాదు చేశారు.

వైసీపీ నాయకుడు లవకుమార్‌కు మాతృవియోగం

వేమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సీనియర్ నాయకుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోగంటి లవకుమార్ మాతృమూర్తి కోగంటి విజయలక్ష్మి (65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విజయలక్ష్మి మృతికి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గాజుల మోహన్, ఎంపీపీ యల్లమాటి మోహనరావు సంతాపం వెలిబుచ్చారు. పార్టీ నాయకులు మేరీ సుబాబు, గుమ్మడి దానియేలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



గుంటూరు: హౌసింగ్ బోర్డు నుంచి అంకిరెడ్డి పాలెం వెళ్లే దారిలో ఉన్న శ్రీ విజేత సేవా సమితి ఇల్లు

ఆఖరి మజిలీకి అతిథి గృహం

450 శవాలకు అక్కడి నుంచే అంతిమ యాత్ర

- రూపాయి ఖర్చు లేకుండా ఆవాసానికి ఏర్పాట్లు
- కర్మకాండలు చేసుకునే అవకాశం
- శ్రీ విజేతా సేవా సమితి ఆధ్వర్యంలో వినూత్న సేవ

ఆ మధ్య కాలంలో అటవీశాఖ రాష్ట్ర అధికారి ఒకరు హఠాత్తుగా మరణించారు. తాడేపల్లిలో ఆయన ఉండేది అద్దె ఇల్లు కావటంతో శవాన్ని అక్కడికి తీసుకురావద్దని ఇంటి యజమాని కరాఖండిగా చెప్పేశారు. దాంతో చేసేది లేక ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు గుంటూరు అటవీశాఖ కార్యాలయం వద్ద ఉంచి అక్కడ నుంచే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆయన ఉన్నత స్థాయి అధికారి కాబట్టి అలా కార్యాలయంలో నైనా అవకాశం కల్పించారు. అదే పేదలు, దిగువ మధ్య తరగతి వారు మరణిస్తే వారి సంగతి ఇక చెప్పనక్కరలేదు. అద్దె ఇంట్లో ఉంటున్నారు కాబట్టి శవాన్ని కచ్చితంగా రోడ్డు మీద ఉంచాల్సిందే. ఆ రోజే ఏ వానో, వరదో వస్తే వారి కుటుంబసభ్యుల బాధ వర్ణనాతీతం. తమ వారికి కనీసం గౌరవప్రదంగా అంతిమ యాత్ర నిర్వహించుకోలేక పోయామనే దిగులు వారిని జీవితాంతం వెంటాడుతుంది. ఇలా ఎన్నో భౌతిక కాయాలకు అంతిమ యాత్రలో చేదు అనుభూతి కలిగిన ఉదంతాలను కళ్లతో చూసిన తర్వాత ఆవిర్భవించిందే శ్రీ విజేత సేవా సమితి. ఇది గుంటూరు నగరంలోనే ఉంది. హౌసింగ్ బోర్డు నుంచి అంకిరెడ్డి పాలెం వెళ్లే దారిలో ఒక పెద్ద ఇంటిని ఈ సేవా సంస్థ కార్యకలాపాల కోసం నిర్మించారు. కుల, మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా దాన్ని ఉచితంగా వాడుకోవచ్చు. ప్రాణం పోగానే భౌతిక కాయాన్ని అక్కడకు తీసుకువచ్చి అంతిమ యాత్ర నిర్వహించుకోవచ్చు.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

2003లో ఆవిర్భవించిన శ్రీ విజేత సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గుంటూరు ఏటీ అగ్రహారంలోని శ్రీ విజేత హైస్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి దాన్ని స్థాపించారు. కొన్ని వేల అనాధ శవాలకు ఈ సంస్థ ద్వారా అంతిమ సంస్కారాలు నిర్వ హించారు. 2020లో అంకిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డులో శ్రీ విజేత సేవా సంస్థ పేరుతో ఒక పెద్ద ఇంటిని నిర్మించారు. అప్పటి నుంచి ఇల్లు లేకుండా మరణించిన వారి భౌతిక కాయాన్ని ఇక్కడకు తీసుకువచ్చి అంతిమ సంస్కారం నిర్వహించుకునే విధంగా అవకాశం కల్పించారు. అక్కడకు తీసుకువచ్చే శవాల కోసం ప్రత్యేకంగా ఫ్రీజర్ బాక్స్‌లు కూడా అందుబాటులో ఉంచారు. అంతిమ యాత్ర సమయంలో వాడుకోవ టానికి స్వర్గ ధామం పేరుతో ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా స్మశాన వాటికకు తీసుకు వెళ్ళటానికి వీలుగా రవాణా సదుపాయం కల్పించారు. ఇప్పటి వరకు సుమారు 450కి పైగా శవాలను ఇక్కడకు తీసుకువచ్చి అంతిమ యాత్రలు నిర్వహించారు.

15 రోజుల వరకు ఉండే అవకాశం

మరణించిన వారి కుటుంబసభ్యులను 15 రోజుల వరకు కొంతమంది ఇళ్లలోకి రానివ్వరు. ఆ ఇబ్బందిని కూడా గమనించిన శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి మరో ఏర్పాటు చేశారు. కేవలం అంతిమ యాత్ర నిర్వహించు కోవటం మాత్రమే కాకుండా మరణించిన వారి కుటుంబ సభ్యులు 15 రోజుల పాటు ఇక్కడే ఉండే సౌలభ్యం కల్పిం చారు. అవసరమయితే పెద్ద కర్మ రోజున బంధువులకు భోజనాలు పెట్టుకోవటానికి కూడా ఏర్పాట్లు చేశారు.

ప్రతి శనివారం పిడికిలి బియ్యం

శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి నగరంలోని ఏటీ అగ్రహారం రెండో లైన్‌లో హైస్కూల్ ఏర్పాటు చేశారు. అక్కడ విద్యనభ్యసించే విద్యార్థులు ప్రతి శనివారం ఒక పిడికెడు బియ్యం తీసుకురావాలని చెబు తారు. వాటితో భోజనం తయారు చేసి వారానికి ఒకసారి గుంటూరు ప్రభుత్వాసు పత్రి వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. విద్యార్థులకు ఆహారం విలువ తెలియ జేయడానికి ఈ కార్యక్రమాన్ని తాము నిర్వహిస్తున్నట్లు చెరుకూరి శ్రీహరి తెలిపారు.

ఎన్నో ఉదంతాలు చూసిన తర్వాత...



అద్దె ఇంట్లో మరణిస్తే శవాన్ని ఇంట్లోకి రానివ్వరు. ఇటువంటి ఉదంతాలు నేను చాలా చూశాను. మనిషి జీవించినంత కాలం ఎంతో గౌరవంగా బతుకుతారు. వాళ్లు మరణించిన తర్వాత కూడా అదే గౌరవంతో అంతిమ యాత్రకు అవకాశం కల్పించాలన్న ఆలోచనతోనే ఈ ఇంటిని ఏర్పాటు చేశాము. ఎంతో మంది దీన్ని ఉచితంగానే వాడుకుంటారు. స్థోమత కలిగిన వాళ్లు అయితే విద్యుత్ బిల్లు ఇస్తారు. అదీ లేకుంటే ఉచితంగానే అన్ని చేసుకునే అవకాశం ఉంది.

-శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి, గుంటూరు



గంటల తరబడి.. వెయిటింగ్

- తెనాలి రైల్వేస్టేషన్ హోంలో సాంకేతిక సమస్యలు
- గుంటూరు, రేపల్లె వైపు నుంచి వచ్చే రైళ్లకు రెడ్ సిగ్నల్
- గమ్యస్థానాలకు చేరుకోవడంలో జాప్యం

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - గూడూరు మూడో రైలు మార్గం నిర్మాణంలో భాగంగా తెనాలి రైల్వేస్టేషన్ యార్డులో జరిగిన పనులు సక్రమంగా పూర్తి కాలేదు. దీంతో నిత్యం ఏదో ఒక సాంకేతిక సమస్య రైల్వేస్టేషన్ హోంలో తలెత్తుతోంది. ఈ కారణంగా గుంటూరు నుంచి తెనాలి మీదగా తిరుపతి, చెన్నై సెంట్రల్ వైపునకు వెళ్లే రైళ్లకు క్లియరెన్స్ లభించడం లేదు. అలానే రేపల్లె నుంచి వచ్చే రైళ్లకు కూడా గ్రీన్‌సిగ్నల్ రాకపోతుండటంతో ఇంచుమించు గంటపాటు హోంలో ఆయా రైళ్లను నిలిపేయాల్సి వస్తోంది. ఆ తర్వాత క్లియరెన్స్ ఇచ్చి పంపినా సమయపాలన నష్టం జరిగిన కారణంగా గమ్యస్థానాలకు గంట నుంచి రెండు గంటల ఆలస్యంగా చేరుతున్నాయి. చెన్నై, నారాయణాద్రి, డెల్టా, శబరి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ సమస్య తలెత్తుతోంది. లాగ్‌బుక్‌లో రోజుకో కారణాన్ని తెనాలి రైల్వేస్టేషన్ అధికారులు పొందుపరుస్తోండటంతో హోంలో సమస్య తలెత్తడానికి అసలు కారణం ఏమిటనేది అంతుచిక్కకుండా ఉన్నది.

సికింద్రాబాద్ వైపు నుంచి గుంటూరుకు రైళ్లు సకాలంలో చేరుకుంటున్నాయి. గుంటూరు నుంచి తెనాలికి గరిష్టంగా 20 నిమిషాల వ్యవధిలోనే చేరుకోవచ్చు. అయినప్పటికీ మధ్యలో ఎక్కడైనా సమయపాలన దెబ్బతింటే దానిని భర్తీ చేసేందుకు కొన్ని రైళ్లకు ఎక్కువ ప్రయాణ సమయాన్ని కేటాయించారు. ఇప్పుడు అది కూడా చాలడం లేదు. గత కొన్ని రోజుల నుంచి చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లు తెనాలి రైల్వేస్టేషన్ హోంకు చేరుకొని గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నాయి. దీనివలన గుంటూరు నుంచి తెనాలికి ప్రయాణ సమయం గం టన్నరకు పైగా పడుతున్నది. గత రాత్రి అయితే గుంటూరు నుంచి రాత్రి 10.19కి బయలుదేరిన చెన్నై ఎక్స్‌ప్రెస్ తెనాలి చేరుకొనేసరికి 11.50 అయింది. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ గుంటూరులో రాత్రి 10.59కి బయలుదేరితే తెనాలికి అర్ధరాత్రి దాటాక 12.27కి చేరింది. దీనివలన రెండు గంటల 13 నిమిషాల ఆలస్యంగా తిరుపతి చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. డెల్టా ఎక్స్‌ప్రెస్ కూడా రేపల్లె నుంచి వచ్చే టప్పుడు తెనాలి హోంలో నిలిపేస్తున్నారు.

ఇరువైపులా క్యాబిన్‌లు తీసేయడం వలనేనా...

గతంలో తెనాలి రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా క్యాబిన్‌లు ఉండేవి. వాటిల్లో జూనియర్ స్టేషన్ మాస్టర్లు ఉండేవారు. డిప్యూటీ స్టేషన్ మాస్టరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై ఉండి క్యాబిన్‌లో ఉండే జూనియర్లకు హాట్‌లైన్ కమ్యూనికేషన్ పరికరాల ద్వారా మార్గదర్శకం చేసేవారు. దాంతో ఎలాంటి సమస్యలు తలెత్తేవి కావు. ఇప్పుడు మూడో రైలు మార్గం నిర్మాణంలో భాగంగా క్యాబిన్‌లు పూర్తిగా తొలగించారు. దాంతో అంతా స్టేషన్‌లోనే కేంద్రీకృతమౌతున్నది. సీనియర్ మాస్టర్లు కేవలం కాషన్ ఆర్డర్ల జారీకి పరిమితం అవుతున్నారు. దీంతో జూనియర్‌లు సక్రమంగా హ్యాండ్లింగ్ చేయలేక హోంలో రైళ్లను నిలిపేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

పల్లెలకు పైసలొచ్చాయ్..!

(5వ పేజీ తరువాయి)

మరమ్మత్తులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఈ నిధులను ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

నిధులు విడుదలతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం

ఎనిమిది నెలల తర్వాత నిధులు విడుదల కావడంతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో సమస్యలు తీరే అవకాశం ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ఈ నిధులతో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నాయి. కాగా, పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సం క్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పంచాయ తీలను బలోపేతం చేస్తోందన్నారు. నిధులు విడుదల చేయడం పట్ల అయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బార్లు బాధలు

(5వ పేజీ తరువాయి)

దృష్టి పెట్టారు. దరఖాస్తు చేయడానికి వారికున్న సాదకబాధకాలు పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. ముందు బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయాలని కోరుతున్నారు.

నేతల వద్దకు క్యూ..

బార్ల దరఖాస్తుల అంశాన్ని ఉన్నతాధికారులు అత్యంత ప్రయారిటీగా తీసుకోవడం ఒక ఎత్తయితే, స్పందన లేకపోతే పోస్టింగే ప్రమాదంలో పడే అవకాశాలు ఉండడంతో ఎక్సైజ్ అధికారులు ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో కీలకంగా ఉండే అధికార పార్టీ నేతల వద్దకు వెళ్లి ఎలాగైనా బార్లకు దరఖాస్తులు పడేలా చూడాలని కోరుతున్నారు. స్థానికంగా ఉన్న ఆశావహులకు నేతలతో ఫోన్లు చేయిస్తు న్నారు. ఇప్పటికే మద్యం షాపులు నిర్వహిస్తున్న వారిని, ఆర్థికంగా బలంగా ఉండి గతంలో ఈ రంగంలో ఉన్నవారిని కలిసి దరఖాస్తులు వేయించేలా అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

వ్యాపారం చేయలేం..

ఇప్పటికే మద్యం షాపుల విషయంలోనే పడుతూ లేస్తూ వ్యాపారం చేస్తున్నామని కొత్తగా బార్ల భారాన్ని మోయలేమని వ్యాపారులు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది. పాలక పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయిలో ఉండే ఎక్సైజ్ సిబ్బందికి ఇలా ప్రతి ఒక్కరికీ ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, ఇవన్నీ బేరీజు వేసుకుని వ్యాపారం చేసేకన్నా మిన్నకుండడమే మేలనే అభిప్రాయాన్ని ఆశావహులు వ్యక్తం చేస్తున్నారు. బార్ల విషయంలో ప్రభుత్వం లైసెన్స్ ఫీజు విషయంలో పునరాలోచన చేస్తుందని అనుకున్నాం కానీ ఇలా అధికారులను తమపైకి పంపి ఒత్తిడి పెడుతుందను కోలేదని వ్యాపారులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 8 మందికి...

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



డాక్టర్ జే ప్రతాప్



పీ సునీత రాణి



గుమ్మడి సునీలా మాధవి



అవ్వారు భద్రావతి

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన రాష్ట్రస్థాయిలో అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. బాపట్ల జిల్లా తుమ్మలపాలెం జడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ జే ప్రతాప్, అద్దంకి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం ధనలక్ష్మి, పల్నాడు జిల్లా నకరికల్లు జడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయురాలు శివకుమారి, పల్నాడు జిల్లా బీ.పురం జడ్పీహెచ్‌ఎస్ గ్రేడ్ 2 హెచ్‌ఎం ఎం పార్వతి, గుంటూరు జిల్లా కనపర్రు ఎంపీయూపీ బీపీఆర్ పాఠశాల ఉపాధ్యాయురాలు వై రాజ్యలక్ష్మి, గుంటూరు ఎస్‌ఎస్‌ఎన్‌ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పీ సునీత రాణి, గుంటూరు పట్టాభిపురం మున్సిపల్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గుమ్మడి సునీల మాధవి, గుంటూరు జిల్లా చీలిపాలెం మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు డాక్టర్ అవ్వారు భద్రావతి రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరికి అవార్డులు అందజేయనున్నారు.

తగ్గిన నిమ్మ ధర

- గతంలో బస్తా 5 వేలు పైచిలుకు
- ఇప్పుడు బస్తా రూ.1700
- ఆనందం వ్యక్తం చేసిన వీధి వ్యాపారులు



పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆకాశాన్నంటేలా ఉన్న నిమ్మకాయ ధరలు ఇప్పుడు తగ్గాయి. ఒక్కప్పుడు రూ.4.500 నుంచి రూ.6 వేల వరకు ధర పలికిన 50 కేజీల నిమ్మకాయల బస్తా.. ఇప్పుడు సగానికిపైగా తగ్గింది. మొన్నటివరకు బెల్లంకొండ, పెదకూరపాడు, అచ్చంపేట, కారంపూడి, దాచేపల్లి, రాజుపాలెం మండలాల రైతులు పండించిన నిమ్మకాయలను మధ్యవర్తులు కొని అధిక ధరలకు వాటిని వ్యాపారులకు విక్రయించేవారు. అయితే గత నెలలో కురిసిన అధిక వర్షాలకు పల్నాడు ప్రాంతంలోని నిమ్మతోటల్లో కాయలు రాలిపోవడం, కొత్త కాపు రాకపోవడంతో ప్రకాశం జిల్లా కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల నుంచి రైతులు పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి ప్రాంతాలకు చేరుకొని నేరుగా వీధి వ్యాపారులకు 50 కేజీల బస్తా రూ.1500లకు విక్రయిస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో పండిన నిమ్మకాయల సైజు, నాణ్యతకు రెండింతల సైజులో మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల నుంచి నిమ్మకాయలు పట్టణ ప్రాంతాలకు చేరవేస్తుండటంతో వ్యాపారులు ఎగిరి గంతేస్తున్నారు. నిమ్మకాయల ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు అమ్మాలంటే ఎంతో ఇబ్బందిగా ఉండేదని, కొనుగోలుదారులు అడిగే సవా లక్ష ప్రశ్నలకు ఎంత ఓపికగా సమాధానం చెప్పినా కొనుగోలు అంతగా ఉండేవి కాదని లక్ష్మయ్య అనే వ్యాపారి చెప్పారు. ఇప్పుడు ధర తగ్గడంతో అమ్మకాలకు ఇబ్బంది లేకుండా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

విద్యార్థులు చదువుతో పాటు

క్రీడల్లోనూ రాణించాలి

మా రోజుల్లో మైదానాలు లేవు ఇప్పుడు మెండుగా సౌకర్యాలు

మహిళా శిశు సంక్షేమ మంత్రి సంధ్యారాణి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూట్ అమరావతి ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల రాష్ట్రస్థాయి నాలుగో లెవెల్ క్రీడా పోటీలు ఆచా ర్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ గిరిజన మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి జీ సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా ర్థులు పాఠ్యాంశాలనే కాకుండా క్రీడలనూ తమ జీవితాల్లో భాగం చేసుకో వాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించి వారిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే విధంగా అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాము ఆడుకునే రోజుల్లో మైదానాలు ఉండేవి కావని, ఇప్పుడు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదల కోసం ప్రభుత్వ వసతి గృహాల్లో రాష్ట్ర ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తు న్నట్లు మంత్రి చెప్పారు. భాషా పాఠ్యాంశాలపై ఇబ్బందులు కలుగుతున్నా యని విద్యార్థుల నుంచి తరచూ తమకు ఫోన్లు వస్తున్నాయని, వాటిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠ శాలల్లో తెలుగు, ఆంగ్లం, హిందీలలో అవగాహన కలిగిన అధ్యాపకులను నియమిస్తామని సంధ్యారాణి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ వైస్ చైర్మన్ యం మల్లికార్జున నాయక్, డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ సదా భార్గవి, వ్యాయమ కళాశాల ప్రిన్సిపాల్ పీపీఎస్ పాల్ కుమార్, స్పోర్ట్స్ కన్వీనర్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో..

కేఎల్‌యూలో మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సులో ఈగల్ ఐజీ రవికృష్ణ

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల మహమ్మారి నుంచి తమ బిడ్డలను కాపాడుకునేందుకు ప్రతి తల్లీ ఒక అంబాసిడర్ కావాలని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిలో బుధవారం కేఎల్ ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా కేఎల్‌యూలో కూడా నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులను ఈగల్ కార్యక్రమాలలో భాగస్వాములను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడితే టోల్ ఫ్రీ నెం.1972కు గానీ వాట్సాప్ నెం.8977781972కు గానీ తెలియజేస్తే బాధితులను ఆ బారి నుంచి కాపాడతామని ఐజీ రవికృష్ణ హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ ఏటివి రవికుమార్ మాట్లాడుతూ, గంజాయి కేసుల్లో అరెస్టయిన వారు జీవితాంతం నేరస్థులుగా మిగిలిపోతారని అన్నారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ వీసీ సారధివర్మ, ప్రో. వీసీలు డాక్టర్ ఎవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకటరామ్, డాక్టర్ కె రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కెఆర్‌ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఉమెన్ డెలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె రూత్ రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణను సత్కరిస్తున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, డీన్ కేఆర్‌ఎస్ ప్రసాద్ తదితరులు

సీనియర్స్ విభాగంలో

వేటపాలెం ఎడ్ల సత్తా

- ప్రత్తిపాడులో ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు
- జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా ఎడ్లు ముందంజ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో వారం రోజులుగా జరుగుతున్న నందమూరి తారక రామారావు మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 190 వరకు ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 4,142.2 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలవగా, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట మండలం, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్ రెడ్డి, సుంకి సాకేత్ రెడ్డికి చెందిన ఎడ్ల జత 4,014.10 అడుగుల దూరం బంగను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్‌కు చెందిన ఎడ్ల జత 3,649.10 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచింది.

జూనియర్స్ విభాగంలో..

జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత 3,300 అడుగుల దూరం బండనులాగి ప్రథమ స్థానంలో నిలవగా, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్ల జత 3000 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ ప్రగతి రిసార్ట్స్‌కు చెందిన మేక ప్రదీప్‌కు చెందిన ఎడ్ల జత 2,940.10 అడుగుల దూరం బండనులాగి తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలైన ఎడ్ల యజమానులకు ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, నసీర్ అహమ్మద్‌తో పాటు గల్లా రామచంద్రరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, వెలివెల్లి సుబ్బారావు, కాసు పెంటారెడ్డి, చిన్నం శ్రీకాంత్, పమిడి అంజియ్యా చౌదరి అన్ని గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గల్లా మాధవి

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలవైపు సాగు చేపట్టాలని, వాటి యాజమాన్య పద్ధతులపై ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రవీణ, లాంఫాం కీటక శాస్త్రవేత్త డాక్టరు రాజేష్ చౌదరి వచ్చారు. సమావేశంలో పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు, శనగ పంటలలోని యాజమాన్య పద్ధతులను, చీడపీడల నివారణా పద్ధతులను రాజేష్ చౌదరి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి కుమారి, ఆత్మ బీటీఎం హారిక, నీటి సంఘం అధ్యక్షులు ప్రభాకరరావు, బోయపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతూ ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ చెప్పారు. బుధవారం మండలంలోని రామాయపాలెం, తిమ్మాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సాగు చేస్తున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ బర్లీ పొగాకు సాగును నిషేధించారని, ఎవ్వరూ సాగు చేయవద్దని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కోల్డ్ స్టోరేజీలకు ప్రభుత్వం రాయితీ అందిస్తున్నారని ఉద్యాన శాఖ అధికారిణి ఎస్. దీప్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏ రాము పాల్గొన్నారు.

రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా పర్చూరు, కారంచేడు నేతలు



తిరుములశెట్టి శ్రీహరి, షేక్ షంషుద్దీన్

పర్చూరు/కారంచేడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మండల పార్టీ నేతలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సుతో ప్రజా ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. పర్చూరు, కారంచేడు మండలాలకు చెందిన ఇద్దరు నేతలకు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కారంచేడు మండల అధ్యక్షులు తిరుములశెట్టి శ్రీహరికి ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్‌గానూ, పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్‌కు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్రస్థాయి పదవులు దక్కిన ఇద్దరు నేతలను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు.

పంచాయతీల ఖాతాలకు రూ.41.98కోట్లు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. దీంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. సీఎం చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను రూ.1,120 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులను పంచాయతీ, జిల్లా మండల పరిషత్ ఖాతాలకు నేరుగా ప్రభుత్వమే జమ చేసింది. వాటిని ఏయే అవసరాలకు వినియోగించాలో స్పష్టంగా పేర్కొంది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు 70శాతం, మండల పరిషత్‌కు 20శాతం, జిల్లా పరిషత్‌కు 10శాతం విడుదల చేసింది. అలా జిల్లావ్యాప్తంగా 729 గ్రామపంచాయతీలకు బుధవారం రూ.41.98 కోట్లు పంచాయతీ అకౌంట్లలో జమయ్యాయి. అందులో 50శాతం నిధులను తాగునీటికి, పారిశుధ్యంకు వినియోగించాలి. మిగిలిన 50శాతం నిధులను వివిధ రకాల అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు.

మా ఊరికి ఆర్టీసీ బస్సు వచ్చింది

పదేళ్ల తర్వాత వింజనంపాడుకు ఆర్టీసీ బస్

ఎమ్మెల్యే ఏలూరిని అభినందిస్తున్న గ్రామస్థులు



బస్సు వద్ద ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటంతో గ్రామస్థులు

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల తర్వాత ఆ గ్రామానికి ఆర్టీసీ బస్సువచ్చింది. గతంలో ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఆ గ్రామానికి బస్సు మాత్రం రాలేదు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో బుధవారం తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చిందని యద్దనపూడి మండలంలోని వింజనంపాడు గ్రామస్థులు ఆనందంతో పొంగిపోయారు. గ్రామానికి రోజూ చిలకలూరిపేట నుంచి ఉదయం 8 గంటలకు వింజనంపాడు, యద్దనపూడి గ్రామాల మీదుగా పూనూరు గ్రామం వరకు బస్సు సర్వీస్ నడుస్తుంది. మళ్లీ అదే రూట్‌లో పూనూరు నుంచి చిలకలూరిపేట బస్టాండుకు వెళుతుంది. అంతేగాకుండా సాయంత్రం 5 గంటలకు మరోసారి ఆ సర్వీస్ నడుస్తుంది. ఈ గ్రామానికి 10 ఏళ్ల క్రితమే ఆర్టీసీ బస్‌ను నిలిపేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్టీసీ బస్సు వద్ద మహిళలు కృతజ్ఞతాపూర్వకంగా ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటాన్ని ప్రదర్శించగా, టీడీపీ నాయకులు ఏలూరి రైట్ రైట్ అంటూ సంతోషాన్ని ప్రదర్శించారు. అంతేగాకుండా తమ మండలానికి చెందిన రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా సహకారం అందించారని కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సాదినేని రంగారావు, కోడూరి నాగరాజు, సాదినేని హరిబాబు, సాదినేని సుధీర్, రావెళ్ల సుధీర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇరువురు ఎంపిక

జిల్లా అవార్డులకు పలువురు ఎంపిక



జాగర్లమూడి ప్రతాప్, మానికొండ ధనలక్ష్మి, అనిత, ప్రీతి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయులలో అద్దంకి మండలానికి చెందిన ఇద్దరు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ జాగర్లమూడి ప్రతాప్, పట్టణంలోని ఎంపీయూపీఎస్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న మానికొండ ధనలక్ష్మి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు పలువురు ఎంపికయినట్లు ఎంఈవో-2 శ్రీనివాసరావు తెలిపారు. అద్దంకి పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న డీఎస్ పద్మావతి జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికయ్యారు. తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ(పీఎస్) ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆర్. శ్రీనివాసరావు, చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ(ఇంగ్లీష్) ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బి. చిన్న అంకారావు, మండలంలో మోదేపల్లి ఎంపీపీఎస్(మెయిన్)లో ఎస్‌జీటీగా పని చేస్తున్న యు. రాజశేఖర్‌రావులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయినట్లు ఆయన తెలిపారు.

యద్దనపూడి మండలంలో...

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. వారిలో పూనూరు జడ్‌పీ హైస్కూలులో ఎస్ఏ అంకరాజు, సూరవరపుపల్లిలోని ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శారదలు ఎంపికయ్యారు.

పంగులూరు మండలంలో...

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనిత, చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ప్రతిమలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ జాతీయస్థాయిలో జరిగిన పోస్టర్ కాంపిటేషన్‌లో ప్రథమ స్థానం సాధించడంలో హెచ్‌ఎం అనిత ప్రోత్సాహం ఉంది. అదేవిధంగా వ్యాయామోపాధ్యాయిని ప్రీతి చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులను యోగాక్రీడలో ఉత్తమ శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన వీరిని ఎంఈవోలు నాగభూషణం, వీరాంజనేయులు అభినందించారు.

ఇంకొల్లు మండలంలో...

ఇంకొల్లు,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దుద్దుకూరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉప్పల చెంచయ్య, నాగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధాయులుగా పనిచేస్తున్న కూసం రమేష్ జిల్లా విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించింది. వీరికి ఈ నెల 5వ తేదీన బాపట్లలో కలెక్టరు, డీఈవో చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. వీరి ఎంపిక పట్ల యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పేర్ని సత్యనారాయణ, షేక్ మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు.

పొగాకు మార్కెట్లో అనిశ్చితి

అధిక ఉత్పత్తి కొనుగోళ్లపై తేల్చని కేంద్రం

ఐదు కేంద్రాల్లో నిలిచిన వేలం

ఇంకా రైతుల ఇళ్ల వద్దనే 40శాతం పంట

ముంచుకొస్తున్న సాగు సమయం

ఇప్పటికే ప్రారంభమైన ఈ సీజన్ రిజిస్ట్రేషన్లు

పలుచోట్ల నారు మళ్లు



వేలానికి వచ్చిన బేళ్ల వద్ద రైతులు

దక్షిణాది పొగాకు మార్కెట్లో అనిశ్చితి నెలకొంది, నిన్న మొన్నటి వరకు ధరల సమస్యతో సతమతం కాగా ప్రస్తుతం అధికంగా జరిగిన పంట ఉత్పత్తి కొనుగోలుపై అయోమయం నెలకొంది. ఎలా ముందుకు పోవాలన్నది అర్థం కాక పొగాకు బోర్డు అధికారులు తర్జనభర్జన పడుతుండగా వారికి తగు సూచనలు ఇవ్వాల్సిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. ఈ ప్రాంతంలో ఉన్న 11 వేలం కేంద్రాలలో ఇప్పటికే ఐదు చోట్ల అధికారిక కొనుగోళ్లు పూర్తయ్యాయి. అధిక ఉత్పత్తి కొనుగోలుపై స్పష్టత రాక వేలం ప్రక్రియ నిలిచిపోయింది. ఈ వారంలో మరో రెండు కేంద్రాల్లోనూ అదే పరిస్థితి ఏర్పడనుంది. మరోవైపు వచ్చే సీజన్ పంట సాగు సమయం సమీపిస్తుంది. అయితే ఇంకా ప్రస్తుత సీజన్ పంటలో 40శాతం మేర పొగాకు ఇళ్ల వద్దనే మిగిలిపోయి ఉండటంతో ఇటు రైతుల్లోనూ, అటు బోర్డు అధికారుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒంగోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇతర పంటలకు భిన్నంగా ఎఫ్‌సీవీ పొగాకు సాగు పూర్తిగా బోర్డు నియంత్రణలో సాగాలి. అయితే గత రెండు మూడేళ్లు కాస్తంత మంచి ధరలు లభించడం, ఇతర పంటల సాగుకు వాతావరణం అనుకూలించక పోవడం ఇతరత్రా కారణాలతో రైతులు ప్రస్తుత సీజన్(2024-25)లో భారీగా పొగాకు సాగు చేశారు. తదనుగుణంగా పంట ఉత్పత్తి కూడా పెరిగింది. రాష్ట్రంలో ఈ కాలానికి 167 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతించిన పొగాకు బోర్డు అందులో దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని 11 వేలం కేంద్రాల పరిధిలో 104.60 మిలియన్ కిలో ఉత్పత్తికి అనుమతించింది. అయితే ఈ ప్రాంతంలో పంట సాగు భారీగా జరగ్గా సుమారు 158.60 మిలియన్ల ఉత్పత్తి అయినట్లు బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. అలా మార్చి 10 నుంచి రెండు దశల్లో కొనుగోళ్ళు ప్రారంభం కాగా ఇప్పటివరకు సుమారు 93.72 మిలియన్లు కొనుగోలు చేయగా సగటున కిలోకు రూ.236.83 ధర లభించింది. ప్రతి ఏటా వంద రోజుల్లో వేలం ప్రక్రియ ముగించాలని పొగాకు బోర్డు ఎప్పటికప్పుడు లక్ష్యంగా పెట్టుకుంటుండగా ఒక నెల అటుఇటుగా సాగుతుంది. అయితే ఈ సీజన్‌లో కొనుగోళ్లు ప్రారంభించి ఆరునెలలు పూర్తి కావస్తున్నా 60శాతం పంట మాత్రమే ఇప్పటివరకు కొనుగోళ్లు జరగ్గా పండిన పంటలో ఇంకా 40శాతం రైతుల ఇళ్ల వద్దనే నిల్వ ఉంది.

అపరాధం రెండు సీజన్లు రద్దు

మార్కెట్ ఆరంభంలో కొంత ధరలు బాగున్నా అనంతరం సరిలేక చాలా చోట్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేదు. ధరల సమస్య ఇప్పటికి కూడా వెంటాడుతున్నప్పటికి తాజాగా అధిక పంట కొనుగోళ్ల సమస్య ఎదురైంది. పొగాకు పంట బోర్డు నియంత్రణలో సాగు చేసేది కనుక అనుమతి ఇచ్చిన మేరకే పంట సాగు, ఉత్పత్తి చేయాలి. దానికన్నా 10శాతం వరకు అధికంగా ఉత్పత్తి జరిగితే వాతావరణ మార్పులో అలా జరగవచ్చు కనుక కొనుగోలు చేస్తారు. అంతకు మించితే అధిక ఉత్పత్తిపై పొగాకు బోర్డు పెనాల్టీలు వేస్తుంది. పంట ఉత్పత్తి నియంత్రణ కోసం అలా చేసేవారు. గతంలో ఒకప్పుడు ఈ పెనాల్టీలు 15శాతం వరకు ఉండేవి. అనంతరం ఒకసారి పది శాతానికి, తర్వాత 7.5 శాతానికి తగ్గించారు. అయితే మూడేళ్ల క్రితం పంట ఉత్పత్తి సరిలేకపోవడం, ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడం, ఎక్కువమంది పరిమితికి లోబడే పండించగా కొద్దిమందికి మాత్రమే అధికంగా ఉత్పత్తి చేయడంతో అపరాధ రుసుంను రద్దు చేశారు. తొలుత కర్ణాటకలో రద్దుచేయగా అనంతరం రాష్ట్రంలోనూ అమలు చేశారు. అలా రెండేళ్లుగా అదనపు పంటకు అపరాధ రుసుం లేకుండానే కొనుగోళ్లు సాగుతున్నాయి.

కేంద్రం నుంచి స్పష్టత కరువు

తదనుగుణంగా వివిధ స్థాయిల్లో రైతులతో సమావేశాలు నిర్వహించగా దక్షిణాది రైతులు ఈ ఏడాది ధరలు లేక నష్టపోయే పరిస్థితులు ఉన్న దృష్ట్యా పెనాల్టీలు వద్దని తప్పనిసరి అయితే రెండుశాతం విధించాలని సూచించగా ఉత్తరాది ప్రాంత రైతులు మాత్రం పెనాల్టీలు గట్టిగానే వేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ మొత్తం అంశాలపై పొగాకు బోర్డు అధికారులు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖకు నివేదించి అధిక పంట కొనుగోళ్లపై తగు సూచనలు ఇవ్వాలని కోరారు. అయితే ఇది జరిగి నెల రోజులు దాటిపోయినా కేంద్రం నుంచి ఎలాంటి సూచనలు రాకపోగా నిత్యం అందుకోసం బోర్డు అధికారులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈలోపు దక్షిణాదిలో పలు కేంద్రాల్లో అధికారికంగా అనుమతి ఇచ్చిన మేర పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. ప్రత్యేకించి ఎస్ఎల్ఎస్ రీజియన్‌లోని కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి, కనిగిరిలలో అలా పూర్తికాగా అధిక ఉత్పత్తి కొనుగోళ్లపై స్పష్టత లేక తదుపరి వేలంను ఆ కేంద్రాలలో పొగాకు బోర్డు అధికారులు నిలిపివేశారు.

పశ్చిమ ప్రాంతంలో త్వరలో నాట్లు

ప్రస్తుతం మిగిలిన ఆరు కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతుండగా ఈ వారంలో ఒంగోలు1,-2 కేంద్రాల్లోనూ అనుమతించిన పంట కొనుగోళ్లు పూర్తయ్యి వాటిలోనూ వేలం ఆపేసే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వచ్చేసీజన్(2025-26) పొగాకు సాగుకు సంబంధించి రిజస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా పలుచోట్ల నారుమడులు కూడా పోశారు. ఈ నెల రెండవ పక్షం నుంచి పశ్చిమ ప్రాంత గ్రామాల్లో వచ్చే సీజన్ పొగాకు నాట్లు ప్రారంభం కానున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఇంకా జాప్యం చేస్తే రైతుల వద్ద ఉన్న 40శాతం పంట కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు పూర్తవుతాయన్న ఆందోళన అటు బోర్డు అధికారుల్లోనూ, ఇటు రైతుల్లోను వ్యక్తం అవుతుంది.

దక్షిణాదిలో 51శాతం అదనంగా..

అయితే ప్రస్తుత సీజన్(2024-25)లో రాష్ట్రంలో భారీగా పంట ఉత్పత్తి పెరిగింది. 167 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా సుమారు 235 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరిగినట్లు అంచనా. అందులో దక్షినాదిలో 104.60 మిలియన్ కిలోలు అనుమతి ఇస్తే సుమారు 158.60 మిలియన్ కిలోలు ఉత్పత్తైనట్లు బోర్డు అధికారులు అంచనా వేశారు. అంటే బోర్డు అనుమతి ఇచ్చిన దాని కన్నా రాష్ట్రంలో 40శాతం అధికంగా ఉత్పత్తి జరగ్గా దక్షిణాదిలో దాదాపు 51శాతానికిపైగా ఉత్పత్తి పెరిగింది. అలా భారీగా ఉత్పత్తి పెరగడంతో మార్కెట్లో డిమాండ్ తగ్గి ధరలు సరిగా లభించలేదని దాని వల్ల రైతులు నష్టపోవడమే కాక వేలం ప్రక్రియ కూడా ఆలస్యం జరగడం, అందులో తరుచూ ఒడిదుడుకులు కూడా ఎదురయ్యాయి. దీంతో కేంద్రప్రభుత్వం పంట నియంత్రణ కోసం బోర్డు అధికారులపై వత్తిడి తెచ్చి మళ్లీ పెనాల్టీలు విధించాలని సూచించింది. ఈ నేపథ్యంలో నెలన్నర క్రితం బోర్డు అధికారులు ఈ అంశంపై పొగాకు బోర్డు సమావేశంలో చర్చించి అధిక ఉత్పత్తి వల్ల నష్టాలను రైతులకు కూడా వివరించి వారి అభిప్రాయాలను కూడా తీసుకొని కేంద్రానికి నివేదించాలని నిర్ణయించారు.

చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును సత్కరించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

అవీఇవీ



చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును సత్కరిస్తున్న చైర్మన్ రాకేష్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన అద్దంకికి చెందిన చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూది రాకేష్, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మాజీ అధ్యక్షుడు గునుపూడి భాస్కర్, మార్కాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జునరావు, పల్లబోతు వెంకటేశ్వర్లు, ఒంగోలు అమరబాను తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి అండగా గ్రామీణ బ్యాంక్



భీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్ సీనానాయక్

బల్లికురవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రగతి బ్యాంక్ నిలుస్తుందని మేనేజర్ సీనా నాయక్ చెప్పారు. మండలంలోని కొండాయపాలేనికి చెందిన ఎస్.శివపార్వతి అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం రూ.2 లక్షల విలువైన భీమా చెక్కును కుమారుడు గోపికి అందజేశారు అసిస్టెంట్ మేనేజర్ బిందుమాధవి, సాయి రామవేంద్ర, పాల్గొన్నారు.

బాల్యమిత్రుని కుటుంబానికి సాయం

చినగంజాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న బాల్యమిత్రుని కుటుంబానికి మిత్రులు అండగా నిలిచి సాయం అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-81 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి కోమట్ల మల్లికార్జునరెడ్డి భార్య భ్రమరాంబ కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మల్లికార్జునరెడ్డి మిత్రులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. పెదగంజాం గ్రామంలోని మల్లికార్జురెడ్డి స్వగృమానికి బుధవారం వెళ్లి ఆయన కూమార్తె, అల్లుడైన శివపార్వతి, అయ్యప్పలకు రూ.50 వేలను అందజేశారు. పద్మావతి (అమలాపురం), కోమట్ల వెంకటరమణారెడ్డి, నరహరి కృష్ణారావు, చుండూరి వెంకటేశ్వరరావు, శిఖరం కోటయ్య, ఉలిచి సాంబశివరావు, వలివేటి రాఘవరావు, కుంచాల శ్రీనివాసరెడ్డి, జ్యోతి, ఎస్ శంకర్, సిద్దం పాపారావు, పల్లపోలు పుండరికాక్షయ్య, ఎమ్.ఎల్.శాస్త్రి, హరిబాబు, విజయలక్ష్మి, రమణారెడ్డి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పర్చూరు - యద్దనపూడి రోడ్డు

అవస్థలు పడుతున్న వాహనదారులు



పర్చూరు - యద్దనపూడి రోడ్డు పరిస్థితి ఇలా

పర్చూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - యద్దనపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూచినా పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులకు నరకప్రాయంగా మారింది. గుంతలను గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. వర్షపు నీటితో నిండిన గుంతలను గుర్తించక పోవటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాగర్లమూడి నుంచి యనమదల మధ్య రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. రోడ్డు అభివృద్ధి సంగతి దేముడికి ఎరుక కనీసం మరమ్మతులు అయినా చేయించి వాహనదారుల అవస్థలు తీర్చాలని ప్రజలు కోరుతన్నారు. ఆ దిశగా అధికారులు యుద్ధప్రాతిపతికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పల్లెలకు పైసలొచ్చాయ్..!

(5వ పేజీ తరువాయి)

మరమ్మత్తులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఈ నిధులను ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

నిధులు విడుదలతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం

ఎనిమిది నెలల తర్వాత నిధులు విడుదల కావడంతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో సమస్యలు తీరే అవకాశం ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ఈ నిధులతో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నాయి. కాగా, పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేస్తోందన్నారు. నిధులు విడుదల చేయడం పట్ల అయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బార్లు బాధలు

(5వ పేజీ తరువాయి)

దృష్టి పెట్టారు. దరఖాస్తు చేయడానికి వారికున్న సాదకబాధకాలు పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. ముందు బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయాలని కోరుతున్నారు.

నేతల వద్దకు క్యూ..

బార్ల దరఖాస్తుల అంశాన్ని ఉన్నతాధికారులు ప్రయారిటీగా తీసుకోవడం ఒక ఎత్తయితే, స్పందన లేకపోతే పోస్టింగే ప్రమాదంలో పడే అవకాశాలు ఉండడంతో అధికారులు ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో కీలకంగా ఉండే అధికార పార్టీ నేతల వద్దకు వెళ్లి ఎలాగైనా బార్లకు దరఖాస్తులు పడేలా చూడాలని కోరుతున్నారు. స్థానికంగా ఉన్న ఆశావహులకు నేతలతో ఫోన్లు చేయిస్తు న్నారు. ఇప్పటికే మద్యం షాపులు నిర్వహిస్తున్న వారిని, ఆర్థికంగా బలంగా ఉండి గతంలో ఈ రంగంలో ఉన్నవారిని కలిసి దరఖాస్తులు వేయించేలా అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

వ్యాపారం చేయలేం..

ఇప్పటికే మద్యం షాపుల విషయంలోనే పడుతూ లేస్తూ వ్యాపారం చేస్తున్నామని కొత్తగా బార్ల భారాన్ని మోయలేమని వ్యాపారులు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది. పాలక పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయిలో ఉండే ఎక్సైజ్ సిబ్బందికి ఇలా ప్రతి ఒక్కరికీ ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, ఇవన్నీ బేరీజు వేసుకుని వ్యాపారం చేసేకన్నా మిన్నకుండడమే మేలనే అభిప్రాయాన్ని ఆశావహులు వ్యక్తం చేస్తున్నారు. బార్ల విషయంలో ప్రభుత్వం లైసెన్స్ ఫీజు విషయంలో పునరాలోచన చేస్తుందని అనుకున్నాం కానీ ఇలా అధికారులను తమపైకి పంపి ఒత్తిడి పెడుతుందనుకోలేదని వ్యాపారులు వాపోతున్నారు.

పరిశ్రమలకు రూ.3.25 కోట్ల రాయితీ మంజూరు

-కలెక్టర్ అన్సారియా వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పరిశ్రమలకు చెందిన 149 క్లెయిమ్‌లకు రూ.3.25 కోట్ల రాయితీలను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంజూరు చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను గడువు తేదీ వరకు వేచి ఉండకుండా త్వరగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ర్యాంప్ పథకంపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పీఎంఈజీపీ ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన దరఖాస్తులను త్వరగా బ్యాంకులకు పంపించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమం ద్వారా పారిశ్రామికవేత్తలు తయారయ్యే కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి శ్రీనివాసరావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, నాబార్డు డీడీఎం రవికుమార్, ఎల్‌డీఎం రమేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ మిషన్ డైరెక్టర్‌గా నాగినేని



నాగినేని రామకృష్ణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ డైరెక్టర్‌గా ఏఎంసీ మాజీ ఛైర్మన్, బాపట్ల జిల్లా తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం 10 మందితో రాష్ట్ర వ్యవసాయ మిషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. అందులో నాగినేని రామకృష్ణకు స్థానం కల్పించింది రామకృష్ణ తండ్రి నాగినేని వెంకయ్య అద్దంకి నియోజకవర్గ మొట్ట మొదటి శాసనసభ్యులుగా పనిచేశారు. నాగినేని రామకృష్ణ గతంలో అద్దంకి ఏఎంసీ ఛైర్మన్‌గా, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడుగా, ధేనువకొండ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. సుదీర్ఘకాలంగా తెలుగుదేశం పార్టీలో చురుకైన నాయకుడిగా పనిచేస్తున్న నాగినేనికి ప్రజా ప్రభుత్వం అరుదైన గుర్తింపు ఇచ్చిందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు రామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీడీవోకి స్వల్పగాయాలు

ఇంకొల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. ఇంకొల్లు నుంచి దుద్దుకూరు వెళుతుండగా మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పడింది. దీంతో శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమచికిత్స చేయించుకున్నారు.

7న ఇంకొల్లులో ఉచిత వైద్యశిబిరం

ఇంకొల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో గుంటూరు వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొని ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తారని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా నోడల్ అధికారిగా యద్దనపూడి ఎంఈవో

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మన బడి-మన భవిష్యత్ కార్యక్రమం జిల్లా నోడల్ అధికారిగా యద్దనపూడి ఎంఈవో పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం బాపట్లలో బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సుబ్రహ్మణ్యేశ్వరరావు బాధ్యతలు స్వీకరించాక ఎంఈవో చిలుకూరి గోపి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

5, 6 తేదీల్లో స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ సమావేశాలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని వేమారెడ్డి సేవా సమితి ఫంక్షన్ హాలులో ఈ నెల 5, 6 తేదీలలో అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతాయని అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. కొండలరావు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ముఖ్య అతిథిలుగా రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కలెక్టర్ వెంకట మురళి, రైతు నేస్తం సంపాదకులు వై. వెంకటేశ్వరరావులు హాజరు అవుతారన్నారు. ఈ సమావేశాలకు సుమారు 20 రాష్ట్రాల నుంచి 150 మంది పత్రిక సంపాదకులు హాజరవుతారని తెలిపారు.

క్రీడాకారునికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సాంబశివరావు, సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యువకులు క్రీడల్లో రాణించి దేశానికి గర్వకారణంలా నిలవాలని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు చెప్పారు. బుధవారం ఛైర్మన్ సాంబశివరావు సమకూర్చిన రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని చినగంజాం మండలం సోపిరాలకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎల్లావుల గోపీరాజు అందుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికపరమైన సమస్యలతో యువకులు నిరుత్సాహపడకూడదన్నారు. అందివచ్చిన సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని చెప్పారు.

చీరాలలో రాజకీయ ఫ్లెక్సీల రగడ

పట్టణంలోని వైఎస్ విగ్రహం వద్ద ముందుగా వైసీపీకి చెందిన ఫ్లెక్సీ ఏర్పాటు

వర్ధంతి కార్యక్రమాలకు అడ్డుగా ఉందని ఆ పార్టీలోనే మరో వర్గం అధికారులకు ఫిర్యాదు

వేటపాలెంలో కాకరేపుతున్న అధికార పార్టీ ఫ్లెక్సీలు



వైసీపీ ఫ్లెక్సీను తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీల రగడ రాజుకుంటోంది. చీరాల పట్టణంలో వైసీపీ ఫ్లెక్సీల వివాదం చోటుచేసుకోగా, వేటపాలెంలో అధికార పార్టీ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశమయ్యాయి. వైఎస్ వర్ధంతికి సంబంధించి రెండు రోజులు ముందుగానే పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు పేర్లి నాని గడియార స్తంభం కూడలిలోని రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వేడుకలు జరుపుకునేందుకు విగ్రహానికి ఫ్లెక్సీ అడ్డుగా ఉందని, వెంటనే తొలగించాలని వైసీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు వాసుమళ్ల వాసు, పట్టణ అధ్యక్షులు యాతం మధుకర్(మేరీబాబు) మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వెంటనే ఆ ఫ్లెక్సీను తొలగించారు. ఈ చర్యతో అంతర్గతంగా చీరాల వైసీపీలో కుమ్ములాటలు బహిర్గతమయ్యాయి.

వేటపాలెంలో శ్రుతి మించిన ఫ్లెక్సీలు

వేటపాలెం మండలంలో పలుచోట్ల అధికార పార్టీకు చెందిన ఫ్లెక్సీలపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యాడర్‌తో సంబంధంలేని వ్యక్తులు ఎమ్మెల్యే కొండయ్య, పార్టీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్‌లు బొమ్మలను చిన్నవిగా ముద్రించి ఓ వ్యక్తి తన ఫొటోను పెద్దవిగా పెట్టించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆ పార్టీలో కాకరేపాయి. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తికి పార్టీ మూలాలకు కూడా సంబంధం లేదని టీడీపీ సీనియర్ నాయకులు చెబుతున్నారు.

పైగా ఆ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తి గత ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ వేసుకున్న టెంట్లపై విరుచుకుపడి వాటిని ధ్వంసం చేసినట్లు సమాచారం. అటువంటి వారు నేడు అధికార పార్టీతో చేతులు కలపడంతో పాటు ప్రజాప్రతినిధులను మించి ఫ్లెక్సీలు వేయించుకోవడం చర్చనీయాంశమైంది.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు



నిమజ్జన కార్యక్రమంలో పూలతో వీడ్కోలు పలుకుతున్న మహిళలు

మార్టూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనాలకు తరలిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి మార్టూరు గ్రామంలో వినాయకుని నిమజ్జనాలు జరుగుతున్నాయి. బుధవారం పడమర బజారు మండపం నుంచి వినాయకుని విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మహిళలు స్వామికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. బాణసంచా కాలుస్తుండగా, డప్పులు, వాయిద్యాలతో, యువకులు, మహిళలు ఆటపాటలతో గ్రామంలోని ప్రధానవీధులలో ఊరేగించారు. తదుపరి సాగర్ కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోపూరి శ్రీనివాసరావు, తేలప్రోలు సాంబశివరావు, తాటి నాగేశ్వరరావు, మువ్వా ఆంజనేయులు, మువ్వా నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగరాజుపల్లి సెంటరు సమీపంలోని బీసీ కాలనీలో వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టరుపై ఊరేగిస్తూ, యువకులు కేరింతలు కొడుతూ స్వామిని నిమజ్జనానికి తరలించారు. సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులోని శివసాయి రెసిడెన్సీలో వినాయక చవితి మండపం వద్ద బుధవారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అపార్టుమెంట్‌లోని మహిళలు ప్రసాద్ గురూజీ శిక్షణలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు మారం జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినాయక మండపంలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

రికార్డుల రూమ్ సక్రమంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో చిరంజీవి

చినగంజాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని రికార్డుల రూమ్, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలని, వాటిని భద్రపరిచే గదిని సైతం పటిష్టంగా ఉంచాలని ప్రకాశం జిల్లా జడ్పీ సీఈవో బి.చిరంజీవి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ అధికారుల హాజరు, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల రికార్డులు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయ్‌కు జడ్పీ సీఈవో పలు సూచనలు అందజేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించేందుకు ప్రత్యేకంగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి సీహెచ్ పూర్ణచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ నిర్మల పాల్గొన్నారు.

పంగులూరులో పీడీసీసీ బ్యాంక్ శాఖ ఏర్పాటు



మాట్లాడుతున్న పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్య

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : పంగులూరు కేంద్రంగా కోఆపరేటివ్ బ్యాంక్ శాఖ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడతామని పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య చెప్పారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం రాత్రి కొప్పెరపాడు గ్రామంలో జరిగింది. పీఏసీఎస్ ఛైర్మన్‌గా గొల్లపూడి అంజయ్య, సభ్యులుగా కోమటి ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ జిల్లా బ్యాంక్ పరిధిలో ఇప్పటివరకు 3,500 కోట్లరూపాయల వ్యాపారం జరుగుతున్నట్లు తెలిపారు. 2,500 కోట్ల డిపాజిట్లు కలిగి ఉన్నాయన్నారు. వ్యాపారాన్ని 4వేల కోట్లకు పెంచానే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రావినూతల బ్యాంక్ మేనేజర్ పఠాన్ రెహమాన్, పూనాటి రామాంజనేయులు, కె.వి.సుబ్బారావు, సీఈవో వేణుబాబు, రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, శేఖర్, సహదేవుడు, పీఏసీఎస్ అధ్యక్షులు బ్రహ్మానందస్వామి, చిలుకూరి కోటయ్య, బెల్లంకొండ శ్రీధర్, మద్దినేని కోటేశ్వరరావు, ఎనికపాటి శ్రీనివాసరావు, పెండ్యాల సుబ్బారావు, నాదెండ్ల నరసింహా రావు, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన విద్యుత్ లైన్లతో లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్ రావు



63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని, దీనివలన వినియోగదారులకు లోవోల్టేజీ విద్యుత్ సమస్య ఉండదని అద్దంకి డివిజన్ ఈఈ మస్తాన్‌రావు చెప్పారు. బుధవారం బల్లికురవలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ల పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వేమవరం ఎస్సీ కాలనీలో గతంలో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు నూతనంగా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈపనులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎన్నో ఏళ్ల నుండి ఉన్న లోఓల్టేజ్ విద్యుత్ సమస్య వేధిస్తోందని ప్రజలు తెలిపారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా గ్రామాల్లో పర్యటించి వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ అల్లూరయ్య, లైన్‌మెన్ ప్రతాప్ కుమార్‌పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పాటుపడాలి

వేటపాలెం విస్తృతస్థాయి సమావేశంలో నేతలు



మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ జనార్దనరావు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్దన రావు, పలువురు టీడీపీ సీనియర్ నాయకులు చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు గుత్తి సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య అధ్యక్షతన వేటపాలెంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరే విధంగా చూడాలన్నారు. గత ప్రభుత్వం వైఫల్యం కారణంగా చోటుచేసుకున్న అనిశ్చతను ప్రజల్లోకి చేర్చాలని చెప్పారు. కమిటీలను పటిష్ట పరిచేందుకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీఇవీ

విద్యాభివృద్ధికి రామకృష్ణయ్య సేవలు మరువలేనివి



రామకృష్ణయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దగ్గుబాటి దంపతులు

ఇంకొల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఘంటా రామకృష్ణయ్య మాస్టారు చేసిన సేవలు మరువలేనివని దగ్గుబాటి విద్యాసంస్థల అధినేత దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరిలు పేర్కొన్నారు. స్థానిక దగ్గుబాటి విద్యాసంస్థల ఆవరణలో బుధవారం ఘంటా రామకృష్ణయ్య కాంస్య విగ్రహాన్ని దగ్గుబాటి దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణయ్య గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నివేదిత స్కూల్ ఛైర్మన్ గోరంట్ల సుబ్బారావు, డాక్టరు బీరం సుందరరావు, డాక్టరు దాసయ్య, కరి బ్రహ్మనాయుడు, మండవ రామకృష్ణ, నల్లూరి కృష్ణయ్య, వెనిగండ్ల వెంకటేశ్వర్లు,పార్థసారథి,రామకృష్ణయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి



ఛైర్మన్ తిరుపతయ్యను కలిసిన కాలేషా

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. బుధవారం విజయవాడలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ ఛైర్మన్ గుడుపూటి తిరుపతయ్యను కాలేషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు.

వ్యాధులు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్‌ఎం అనిత

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : అసురక్షిత సంబంధాల వల్ల సంక్రమించే వ్యాధులు, డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలను గుర్తించి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ చెప్పారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవీ, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షించని రక్తమార్పిడి వలన హెచ్‌ఐవీ వ్యాధి ఇతరులకు సోకే ప్రమాదాన్ని గుర్తించాలన్నారు. ముందుగా పాఠశాల విద్యార్థులు సైకిళ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం హెచ్‌ఎం అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎల్‌డబ్ల్యూఎస్ సూపర్‌వైజర్ వినయ్, ఏఎన్‌ఎం శ్రావణి పాల్గొన్నారు.

కేన్సర్ నియంత్రణకు కృషి చేయాలి

జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ నియంత్రణకు ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ చెప్పారు. బుధవారం చీరాల ఐఎంఏ హాలులో డివిజన్ పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బందితో ఎన్‌సీడీ 4.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌ల గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. రోగికు సంబంధించి స్క్రీనింగ్, రెఫరల్ పద్ధతిపై పలు సూచనలు చేశారు. అలాగే వైరల్ ఫీవర్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే అండ్ ఎన్‌సీడీ అధికారిణి లలిత రాజేశ్వరి, ఎన్టీఆర్ ట్రస్టు జిల్లా అధికారి ప్రవీణ్, డాక్టర్లు జయసింహ, జాకబ్, షణ్ముఖీ, స్వాతి కిరణ్, పరమేశ్వరి పాల్గొన్నారు.

రైతులకు రోటరీ సత్కారం



రైతులను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్, గాండీవ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఆరుగురు రైతులను సత్కరించారు. గత నెల 29 వ తేదీ బలరాముని జన్మదినం సందర్భంగా వ్యవసాయమే ప్రధానవృత్తిగా, జీవనం సాగిస్తున్న నలుగురు సీనియర్ రైతులు, వారితో పాటు మరో ఇద్దరు యువకులైన రైతులను వారు సత్కరించారు. వారిలో నాగబోయిన సాంబశివరావు, ఉప్పలపాటి సుబ్బరాజు, దొడ్డా సాంబయ్య, చింతనిప్పుల వీరరాఘవులు, దుడ్డు కోటయ్య, షేక్ జిలానీలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, రావి అంకమ్మచౌదరి, చెన్నుపాటి బసవరాములు, షేక్ కాజాహుస్సేన్, తాటి నాగేశ్వరరావు, పెంట్యాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

భూసారపరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలకు అనుగుణంగా పంట సాగు, ఎరువులు, పురుగుమందుల వినియోగం చేపట్టాలని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయాలని ఏవో సుబ్బారెడ్డి కోరారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు కలిగి ఉంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, శివరాజు, వ్యవసాయ సహాయకులు బీ.బీ.జాన్, గోపీకిరణ్ పాల్గొన్నారు.